

పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

A.C.O - 9003200801

S.R - 9551168092

ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017



సదస్సులో తమిళనాడు స్టార్టప్ ఎకో సిస్టమ్ అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ఐదేళ్లలో ట్రిలియన్ డాలర్ల

ఆర్థిక ప్రగతిని సాధిస్తాం

• గ్లోబల్ స్టార్టప్ సమ్మిట్‌లో సీఎం స్టాలిన్

చెన్నై, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఐదేళ్లలోగా 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక ప్రగతిని సాధించి తీరుతామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. కోయంబత్తూరు కొడీసియా మైదానంలో రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) శాఖకు అనుబంధంగా ఉన్న కొత్త పరిశ్రమల ఆవిష్కరణ, వ్యవస్థాపకత సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఏర్పాటైన రెండు రోజుల గ్లోబల్ స్టార్టప్ సమ్మిట్-2025ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తమిళనాడు స్టార్టప్ ఎకో సిస్టమ్ రిపోర్ట్ -2025ను, తమిళనాట 2035లోపున స్టార్టప్‌ల ప్రగతి నిర్దేశిత నివేదికను ఆయన ఆవిష్కరించారు. కొత్త పరిశ్రమలు స్థాపించే దిశగా దివ్యాంగులకు, హిజ్రాలకు సబ్సిడీతో కూడిన అనుమతి ఉత్తర్వులను ఆయన పంపిణీ చేశారు. అదే విధంగా కొత్తగా పరిశ్రమలు నెలకొల్పనున్న సంస్థలకు కల్పించనున్న రాయితీల వివరాలను ప్రకటించారు. ఫ్రాన్స్, కెనడా, జర్మనీ దేశాలకు చెందిన బహుళజాతి సంస్థలు కొన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో రాష్ట్ర కొత్త పరిశ్రమల ఆవిష్కరణ, వ్యవస్థాపకత సంస్థతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో సీఎం ప్రసంగిస్తూ.. శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉన్న రాష్ట్రాల్లోనే కొత్త పరిశ్రమలు అధికంగా ఏర్పాటవుతాయని, రాష్ట్రం శాంతి భద్రతలకు నెలవుగా ఉండటం వల్లే గత నాలుగేళ్ల డీఎంకే పాలనలో ఎంఎస్ఎంఈలు సహా కొత్త పరిశ్రమల సంఖ్య ఆరింతలకు పెరిగిందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో రెండు రోజులపాటు జరుగనున్న ఈ గ్లోబల్ స్టార్టప్ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలో కొత్త పరిశ్రమలకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, లైసెన్సుల జారీలో అమలు చేస్తున్న ఏకగవాక్ష విధానాల గురించి పెట్టుబడిదారులకు సుస్పష్టమైన అవగాహన ఏర్పడుతుందన్నారు.రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రెండు వేలకు పైగా కొత్త స్టార్టప్‌లు ఉండేవని, గత నాలుగేళ్లలో వాటి సంఖ్య 12 వేలకు పెరిగాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రతియేటా 33శాతం వరకూ కొత్త స్టార్టప్‌లు నెలకొల్పేందుకు దరఖాస్తులు వస్తున్నాయని చెప్పారు. నీతి ఆయోగ్ కింద పని చేసే అటల్ ఇన్నోవేషన్ మిషన్ జారీ చేసిన ప్రకటన మేరకు రాష్ట్రంలో స్టార్టప్‌లు పటిష్ఠంగా పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు.ఈ సదస్సులో మంత్రులు ఈవీ వేలు, ఎస్.ముత్తుసామి, దామో అన్బరసన్, ఎంపీ సామినాథన్, టీఆర్బీ రాజా, ఉగండా సాంకేతిక మంత్రి మోనికా ముసెన్రో మసన్నా, స్విస్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ నిక్కల్స్ సామువేల్ గుహర్, ఎంపీలు గణపతి రాజ్‌కుమార్, కె.ఈశ్వరసామి, శాసనసభ్యుడు వి.సెంథిల్‌బాలాజీ, దుబాయ్ సిలికాన్ ఒయాసిస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కానిమ్ అల్‌బాల్సీ, కేంద్ర ఎలక్ట్రానిక్స్ సమాచార శాఖ కార్యదర్శి కృష్ణన్, ఎంఎస్ఎంఈ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అతుల్ ఆనంద్, కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్ కె.క్రియపన్వర్, ఆసియా బెర్లిన్ సీఈవో మార్టన్ రసాన్‌బెర్క్ తదితరులు పాల్గొన్నారు.

రూ.81.40 కోట్లతో గోల్డ్ జ్యువెలరీ పార్కు...

కోయంబత్తూరు కురింజి సిడ్కో పారిశ్రామికవాడలో రూ.81.40 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న గోల్డ్ జ్యువెలరీ పార్కుకు ముఖ్యమంత్రి స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఈ జువెలరీ ప్రాజెక్టుకు రూ.126.12 కోట్ల మేరకు నిధులు కేటాయించారు. ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా జ్యువెలరీ పార్కును ఐదు అంతస్తుల భవన సముదాయంలో ఏర్పాటు చేయనున్నారు. గత యేడాది కోయంబత్తూరులోని స్వర్ణకారుల సంఘాల ప్రతినిధులు స్టాలిన్‌ను కలిసి తమ కోసం బంగారు నగల తయారీ కర్మాగారాలు ఒకే చోట ఉండేలా గోల్డ్ జ్యువెలరీ పార్కును నిర్మించాలని కోరారు. వారి కోరిక ప్రకారం గురువారం ఆయన జ్యువెలరీ పార్కుకు శంకుస్థాపన చేశారు. ఈ పథకంలో భాగంగా స్వర్ణకారులకు 100 నుంచి 300 చదరపుటడుగుల విస్తీర్ణం కలిగిన స్థలాలను నగల తయారీ కోసం కేటాయించనున్నారు. అదే విధంగా హాల్‌మార్క్ పరిశోధన కేంద్రం, స్వర్ణాభరణాల ఎగ్జిబిషన్ హాలు, త్రీడీ ప్రింటింగ్ లేసర్ కటింగ్ సదుపాయాలు, శిక్షణా కేంద్రం, శిశు సంరక్షణ కేంద్రం, సీసీ కెమెరాల వ్యవస్థ, అగ్ని నిరోధక యంత్రాల వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.



ఈపీఎస్ సభలో ఎగురుతున్న టీవీకే జెండాలు

ఈపీఎస్ రోడ్‌షోలో టీవీకే జెండాలు

• కూటమికి శ్రీకారం చుట్టినట్లుగా ఉందన్న అన్నాడీఎంకే శ్రేణులు

ప్యారీస్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) రోడ్‌షోలో తమిళగ వెట్రి కళగం (టీవీకే)జెండాలు రెపరెపలాడటం చర్చనీయాంశమైంది. రెండేళ్లుగా పార్టీని నడుపుతున్న విజయ్ వ్యవహారశైలి అంతుబట్టని విధంగా మారింది. ఆదిలో అన్నాడీఎంకేతో సఖ్యతగా వున్న ఆయన.. ఆ తరువాత ఆ పార్టీతో పాటు బీజేపీకి కూడా దూరంగా ఉంటున్నారు. ఇటీవల కరూర్ తొక్కిసలాట అనంతరం అన్నాడీఎంకే, బీజేపీలు టీవీకేకు అండగా నిలిచినట్లుగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా ప్రచారానికి వెళుతున్న ఈపీఎస్‌ను టీవీకే కార్యకర్తలు ప్లకార్డులు, బ్యానర్లతో ఆహ్వానిస్తున్న విషయం తెలిసిందే. అదే విధంగా నామక్కల్ జిల్లా కుమారపాళయంలో బుధవారం రాత్రి ఈపీఎస్ పాల్గొన్న రోడ్‌షోలో టీవీకే జెండాలు కనిపించాయి. వాటిని చూపించిన ఈపీఎస్ ఇది కూటమికి శ్రీకారం చుట్టినట్లుగా ఉందని పేర్కొనడంతో చుట్టూ ఉన్న పార్టీ శ్రేణులు కరతాళధ్వనులతో హర్షంవ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ, డీఎంకే నేతృత్వంలోని కూటమి బలమైనదని సీఎం స్టాలిన్ భావిస్తున్నారని, అయితే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం వరించే కూటమి అన్నాడీఎంకే నేతృత్వంలో ఏర్పడనున్నదని ధీమావ్యక్తం చేశారు.



డిప్యూటీ సీఎం ఉదయనిధి

'చే'జారదు..

• హస్తం పార్టీపై ఉదయనిధి నర్మగర్భ వ్యాఖ్యలు

ప్యారీస్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమి నుంచి హస్తం గుర్తు (కాంగ్రెస్) జారిపోదని ఉపముఖ్యమంత్రి ఉదయనిధి నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. దిండుగల్ సమీపంలోని వేడచెందూర్‌లో గురువారం ఉదయం జరిగిన డీఎంకే ప్రముఖుడు స్వామినాథన్ ఇంటి వివాహ వేడుకల్లో ఉదయనిధి పాల్గొని వధూవరులకు పుష్పగుచ్ఛం సమర్పించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నాడీఎంకే ఇప్పటికే బీజేపీకి బానిసలా మారిందని, కొత్త బానిసల కోసం కమలనాథులు వెతుకుతున్నారని చమత్కరించారు. కేంద్రప్రభుత్వ బెదిరింపులకు డీఎంకే ఎప్పటికీ భయపడే ప్రసక్తేలేదని, అదేవిధంగా కూటమిలో ఉన్న మిత్రపక్షాలకు ఇచ్చే గౌరవం కూడా తగ్గబోదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పుడున్న డీఎంకే కూటమి అలాగే కొనసాగుతుందని, కాంగ్రెస్ పార్టీ కూటమి నుంచి బయటికెళ్లే ప్రసక్తేలేదన్నారు. అధిక సీట్లు డిమాండ్ చేసే మిత్రపక్షాలతో డీఎంకే ఎన్నికల నిర్వహణ కమిటీ చర్చిస్తుందని, కూటమి అధ్యక్షుడు సీఎం స్టాలిన్ మంచి నిర్ణయం తీసుకుంటారన్నారు. తమ కూటమే బలమైన కూటమి అని మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి బుధవారం రాత్రి జరిగిన రోడ్‌షోలో ప్రకటించారని, ఆ కూటమిలో చేరిన పార్టీలపై ఇప్పటివరకు స్పష్టతలేదన్నారు.

బీఎస్పీ మాజీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో

ప్రధాన నిందితుడు నాగేంద్రన్ మృతి



నాగేంద్రన్ మృతదేహం ఉన్న స్టాన్లీ ఆస్పత్రి వద్ద కాపలా కాస్తున్న పోలీసులు



రౌడీ నాగేంద్రన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో ప్రధాన నిందితుడు,మూడు దశాబ్దాలుగా హత్యలు, హత్యాయత్నాలు, దాడులు జరిపిన కేసుల్లో జైలుకు వెళ్లివచ్చిన పేరుమోసిన రౌడీ నాగేంద్రన్ తీవ్ర అనారోగ్యంతో స్టాన్లీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆమ్‌స్ట్రాంగ్ గత జూలై 5వ తేది రాత్రి పెరంబూరు సమీపంలో ఓ ఇంటి నిర్మాణ పనులు పరిశీలిస్తుండగా ఓ ముఠా వేటకొడవళ్లతో దాడి జరిపి దారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే. పోలీసులు జరిపిన విచారణలో పుళల్ సెంట్రల్ జైలులో ఉంటూ నాగేంద్రన్ ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు కుట్రపన్నినట్లు వెల్లడైంది. నాగేంద్రన్, ఆయన కుమారుడు, న్యాయవాది అశ్వత్థామన్, రౌడీ ఆర్కాడ్ సురేష్ తమ్ముడు పొన్నన్‌బాలు, తిరువేంగడం, న్యాయవాది అరుళ్, రాము, తిరుమలై, మణివన్నన్,శివా, అప్పు అలియాస్ విజయ్, కోళి అలియాస్ గోకుల్, సంతోష్, సెల్వరాజ్, అంజలై, పొర్కొడి, మలర్‌కొడి సహా 28 మందిని పోలీసులు అరెస్టు చేశారు. శంభో సెంథిల్, మొట్టై కృష్ణన్ అనే ఇరువురు పరారీలో ఉన్నారు. వీరిలో రౌడీ తిరువేంగడం నగర శివారులో జరిగిన పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఈ నేపథ్యంలో గత కొద్ది మాసాలుగా పుళల్ జైలులో వున్న రౌడీ నాగేంద్రన్ కాలేయ సమస్యలు అధికమైన తీవ్ర అస్వస్థత చెందటంతో, గత ఆగస్టులో పోలీసులు అతడిని చికిత్స కోసం స్థానిక స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యనిపుణులు అతడిని అత్యవసర చికిత్సా విభాగంలో చేర్చి చికిత్సలందిస్తూ వచ్చారు. గురువారం ఉదయం చికిత్స ఫలించక నాగేంద్రన్ మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని ఉత్తర చెన్నైలోని నివాసగృహానికి తరలించారు. నాగేంద్రన్ ఇద్దరు కుమారులు ప్రస్తుతం జైలులో ఉండటంతో అతడి అంత్యక్రియలు ఎవరితో జరిపించాలనే విషయమై కుటుంబ సభ్యులు మల్లగుల్లాలు పడుతున్నారు. నాగేంద్రన్ తొలుత బాక్సర్‌గా ఉండేవాడు. అతడికి విజి, ప్రముఖ రౌడీ వెల్లయ్‌రవితో పరిచయాలు ఏర్పడ్డాయి. దీనితో బాక్సర్‌గా మారిన తర్వాత ఈ ముగ్గురూ హత్యాయత్నాలు, దారిదోపిడీలకు పాల్పడుతూ పేరుమోసిన రౌడీలుగా చెలామణి అయ్యారు. 1990లో జరిగిన ఓ హత్యకేసులో నాగేంద్రన్ అరెస్టయ్యాడు. ఆ తర్వాత కూడా అతడు రౌడీయిజాన్ని మానుకోలేదు. నగరంలోని పలు పోలీసుస్టేషన్లలో నాగేంద్రన్‌పై ఐదు హత్యకేసులు, 14 హత్యాయత్నం కేసులు సహా మొత్తం 28 కేసులు నమోదై ఉన్నాయి.

విజయ్‌కు ప్రాణహాని

• బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్





పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): టీవీకే అధినేత విజయ్‌కు ప్రాణహాని ఉందని, ఆ అనుమానంతోనే ఆయన కరూర్ వెళ్లేందుకు భద్రత కోరారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ వ్యాఖ్యానించారు. తిరునల్వేలిలో గురువారం నయినార్ నాగేంద్రన్ విలేఖరులతో మాట్లాడుతూ... కరూర్ తొక్కిసలాటలో 41 మంది మృతి చెందిన ఘటనలో విజయ్ ఇంకా బాధితులను పరామర్శించలేదన్నారు. తొక్కిసలాటను వంకగా చూపించి, విజయ్‌ను రాజకీయాల నుంచి దూరం చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. విజయ్ కరూర్‌కు వెళితే ఆయన ప్రాణాలకు గ్యారంటీ లేదన్నారు. ఈ వ్యవహారంలో డీఎంకే ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకుంటోందని ఆరోపించారు. అన్నాడీఎంకే సభలో టీవీకే జెండాలు ఎగురవేశారని, ఈ ఘటన కార్యకర్తల ఉత్సాహానికి చిహ్నంగా ఉందన్నారు. ప్రస్తుతం కార్యకర్తలుగా ఉన్న వారు ప్రజా ప్రతినిధులవుతారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు ఎన్డీఏ కూటమి వైపు చూస్తున్నారన్నారు. ఎవరెన్ని చెప్పినా డీఎంకే కూటమి విజయం సాధిస్తుందని తిరుమావళవన్ చెబుతున్నారని, ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఆయన గెలుస్తామని చెబుతూనే ఉంటారని ఎద్దేవా చేశారు.

12 నుంచి ప్రచార యాత్ర

మదురై నుంచి ఈ నెల 12 నుంచి తన ప్రచార యాత్ర ప్రారంభమవుతుందని నయినార్ నాగేంద్రన్ తెలిపారు. యాత్ర ప్రారంభోత్సవానికి బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా రావాల్సివుందని, కానీ బిహార్ ఎన్నికల ప్రచారం కారణంగా ఆయన పర్యటన రద్దయిందని తెలిపారు. అందువల్ల ప్రచార యాత్రను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభిస్తారన్నారు. తన ప్రచార యాత్రకు పలు నిబంధనలు విధించారని, రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ విధించిన నిబంధనల మేరకు తన యాత్ర సాగుతుందని నాగేంద్రన్ తెలిపారు.

లైంగిక వేధింపులకు పాల్పడ్డ

75 ఏళ్ల పూజారి అరెస్ట్

అడయార్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆలయ దర్శనానికి వచ్చిన 13 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన పూజారిని పోలీసులు అరెస్ట్ చేశారు. కుంభకోణం సమీపం తిరువలంసుళి గ్రామంలో వెయ్యేళ్ల పురాతనమైన వెల్ల వినాయకుడి ఆలయం ఉంది. ప్రసిద్ధిచెందిన ఈ ఆలయానికి ప్రతి రోజు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామి దర్శనం చేసుకుంటారు. ఈ క్రమంలో, ఈ నెల 8వ తేది రాత్రి 7గంటలకు సమీప గ్రామానికి చెందిన ఓ కుటుంబం తమ 13 ఏళ్ల కుమార్తెతో ఆలయానికి వచ్చారు. స్వామివారిని దర్శించుకున్న వారికి పూజారి విశ్వనాధన్ (75) తీర్థప్రసాదాలు అందజేశారు. ఆ సమయంలో, బాలిక తన చేతిలో ఉన్న బ్యాగును పక్కన పెట్టి ప్రసాదాలు స్వీకరించి వెళ్లిపోయింది. ఆలయ ప్రాంగణాలు పరిశీలించిన కుటుంబం,హుండీలో నగదు వేసే సమయంలో, బ్యాగు మరిచిన విషయాన్ని గుర్తించిన బాలిక అక్కడకు వెళ్లింది.ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పూజారి విశ్వనాధన్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఏడుస్తూ వచ్చిన బాలికను విచారించిన తల్లిదండ్రులు, ఆమె చెప్పిన విషయం విని దిగ్భ్రాంతి చెంది ఆలయ నిర్వాహకులకు తెలిపారు. అధికారుల ఫిర్యాదుతో కుంభకోణం మహిళా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి విశ్వనాధన్‌ను అరెస్ట్ చేసి, వృద్ధాప్యం కారణంగా ఆయనను బెయిలుపై విడుదల చేశారు.

6 మదురై ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు | అయ్యనార్ ఆలయ తరహాలో అంకాళేశ్వరాలయం 7

సచివాలయ ముట్టడికి

సీఐటీయూ యత్నం

• వందలాది మంది కార్యకర్తల అరెస్ట్



నిరసనకారులను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు



సీఐటీయూ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానం అమలు సహా పలు సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ చేపట్టిన సచివాలయ ముట్టడి కొంత ఉద్రిక్తత రేపింది. పాత పింఛన్ విధానం అమలు, మాజీ రవాణా కార్మికులకు పింఛన్ బకాయిల చెల్లింపు సహా పలు కోర్కెల సాధనకు గురువారం సచివాలయం ముట్టడి చేపడతామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సౌందర్‌రాజన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం ఉదయం స్థానిక పల్లవన్ హౌస్ వద్ద కార్యకర్తలు భారీగా గుమిగూడారు. తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులు చేతబట్టి, నినాదాలు చేస్తూ వారు సచివాలయానికి బయల్దేరారు. కొందరు సెంట్రల్ రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లగా, మరికొందరు మన్రో విగ్రహం మీదుగా బయల్దేరారు. అప్పటికే ఆ ప్రాంతాల్లో భారీగా మోహరించిన పోలీసులు, ఇరుమార్గాల్లో వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అప్పటికే సిద్ధంగా ఉంచిన ఎంటీసీ బస్సుల్లో సీఐటీయూ నేతలు, కార్యకర్తలను తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సౌందర్‌రాజన్ మాట్లాడుతూ... పాత పింఛన్ విధానం అమలు చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే హామీ ఇచ్చిందన్నారు. అధికారం చేపట్టి నాలుగున్నరేళ్లు గడిచినా ఆ హామీపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. రాబోయే శాసనసభ సమావేశంలో పాత పింఛన్ విధానంపై ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సమాచార ధ్వని

విద్యుత్ ఫిర్యాదుల పరిష్కార వేదిక

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ)లోని 45 విద్యుత్ పంపిణీ సర్కిళ్లలో ప్రతి దానిలోనూ ఒక విద్యుత్ ఫిర్యాదుల పరిష్కార వేదిక పనిచేస్తోంది. అక్కడ ఫిర్యాదుపై చేసిన పరిష్కారంపై సంతృప్తి చెందని వినియోగదారులు, విద్యుత్ నియంత్రణ కమిషన్ పరిధిలోని విద్యుత్ ఫిర్యాదుల పరిష్కార అధికారికి అప్పీలు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు www.tnerc.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

నేడు బెంగళూరుకు స్టాలిన్ పయనం

చెన్నై,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): సీఎం ఎంకే స్టాలిన్ కుటుంబ సమేతంగా శుక్రవారం బెంగళూరు నగరానికి పయనమవుతున్నారు. స్టాలిన్ సోదరుడు సెల్వం సంవత్సరీకం శుక్రవారం బెంగళూరులోని ఆయన నివాసగృహంలో జరుగనుంది..ఆకార్యక్రమంలో పాల్గొనేందుకుగాను సతీమణి దుర్గాస్టాలిన్,తనయుడు ఉదయనిధి తదితర కుటుంబ సభ్యులతో ఆయన ప్రత్యేక విమానంలో బెంగళూరుకుబయలుదేరి వెళుతున్నారు.

'నెట్' పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసేందుకు, యూజీ కోర్సుల పరిశోధన అధ్యయనాలకు కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ పొందేందుకు, పీహెచ్‌డీలో ప్రవేశానికి 'నెట్' అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావలసి ఉంది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సంవత్సరానికి రెండు సార్లు (జూన్, డిసెంబరు) నిర్వహిస్తోంది. ఆ ప్రకారం, ఈ సంవత్సరం యూజీసీ నెట్ పరీక్ష రెండవ విడత పరీక్ష డిసెంబరులో నిర్వహించనున్నారు. పరీక్ష తేది వివరాలు త్వరలో ప్రకటించనున్నారు. ఆసక్తి ఉన్న గ్రాడ్యుయేట్లు నవంబరు 7వ తేదిలోపు /ugcnet.nta.nic.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. నవంబరు 10 నుంచి 12వ తేది వరకు దరఖాస్తులో సవరణలు చేసుకోవచ్చు. పరీక్షకు సంబంధించిన సిలబస్, దరఖాస్తు రుసుము తదితర వివరాలను www.nta.ac.in అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.మరిన్ని వివరాలకు 011-69227700, 40759000 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

'క్యూ ఆర్ కోడ్ సమ్మన్' పరిచయం చేసిన ఈడీ

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విచారణకు హాజరయ్యే వ్యక్తి, మనీలాండరింగ్ ముఠాల బారిన పడకుండా ఉండేలా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), 'క్యూ ఆర్ కోడ్‌తో కూడిన సమన్లు పంపే వ్యవస్థను పరిచయం చేసింది. ఈ మేరకు ఈడీ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో.. మనీలాండరింగ్, విదేశీ మారకద్రవ్య మోసం చట్టాల కింద విచారణకు హాజరుకావాలని ఈడీ నుంచి సమన్లు జారీచేస్తున్నామన్నారు. ఇటీవల, కొందరు ఈడీ అధికారులు పంపినట్లుగా సమన్లు సిద్ధం చేస్తున్నారని, ఆన్‌లైన్‌లో డిజిటల్ అరెస్టులు, మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. మనీలాండరింగ్ వ్యక్తుల బారిన పడకుండా, ఇక నుంచి క్యూఆర్ కోడ్‌తో కూడిన సమన్లు పంపించనున్నామని తెలిపారు. సమన్లలో, అధికారుల సంతకంతో పాటు కార్యాలయ ముద్ర ఉంటుందన్నారు. ఈ సమన్లపై అనుమానం కలిగితే, అందులో తెలిపిన అధికారిని సంప్రదిస్తే, ఆయన కార్యాలయ ఈ-మెయిల్ చిరునామా పంపుతారని అధికారి తెలిపారు.

మద్రాసు యూనివర్శిటీ మెరీనా క్యాంపస్ గిండికి తరలింపు

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్రాసు విశ్వవిద్యాలయంలోని మెరీనా క్యాంపస్‌లో పనిచేస్తున్న విభాగాలను గిండి క్యాంపస్‌కు మార్చనున్నారు. స్థానిక చేపాక్కం, ట్రిప్లికేన్, గిండి తదితర ప్రాంతాల్లో మద్రాసు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లు పనిచేస్తున్నాయి. ట్రిప్లికేన్‌లో పనిచేస్తున్న మెరీనా క్యాంపస్ 90లోని రెండతస్తుల భవనాలు 90 ఏళ్ల క్రితం నిర్మితమయ్యాయి. ఈ కారణంగా, స్తంభాలు, గోడల్లో పగుళ్లు ఏర్పడగా, పై కప్పు కూడా శిధిలావస్థకు చేరింది. ఈ భవనం ప్రాచీనత మారకుండా ప్రజాపనుల శాఖ మరమ్మతు పనులు చేపడుతోంది. పనుల కోసం క్యాంపస్ ఖాళీ చేసి ఇవ్వాలని ప్రజాపనుల శాఖ విశ్వవిద్యాలయ యాజమాన్యాన్ని కోరింది. దీని ప్రకారం, పునరుద్ధరణ పనులకు అంతరాయం కలుగకుండా ఉండేలా, మెరీనా క్యాంపస్‌లో పనిచేస్తున్న అరిబిక్, పర్షియన్, ఉర్దూ, విదేశీ విభాగాలు, హిందీ, కన్నడ, మలయాళం, సంస్కృతం, తమిళం-భాష మరియు సాహిత్యం అనే తొమ్మిది విభాగాలు గిండిలోని అన్నా విశ్వవిద్యాలయ సమీపంలోని గిండి క్యాంపస్‌కు మార్చనున్నారు.

పొంగల్ నుంచి వేళచ్చేరి-మౌంట్ ఎమ్మార్టీఎస్ రైలు సేవలు

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ మధ్య ఎమ్మార్టీఎస్ రైలు సేవలు పొంగల్‌కు ప్రారంభం కానున్నాయి. చెన్నై బీచ్-వేళచ్చేరి ఎమ్మార్టీఎస్ రైలు మార్గంలో, ప్రతిరోజు 100 సబర్బన్ రైలు సర్వీసులు అందుబాటులో ఉండగా, ప్రతిరోజు సుమారు 1 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ వరకు ఈ రైలు సేవలు విస్తరణ పనులు గత 2008లో ప్రారంభమయ్యాయి. కానీ, ఆదంబాక్కం, తిల్లైంగా నగర్ ప్రాంతాల్లో భూసేకరణ సమస్యల కారణంగా ఈ పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. భూసేకరణ సమస్య కొలిక్కిరావడంతో, 2022లో పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఆదంబాక్కం-సెయింట్ థామస్ మౌంట్ అనుసంధాన పనులు పూర్తయ్యాయి. తదుపరి రైలు మార్గం, సిగ్నలింగ్ వ్యవస్థ, పుళిదివాక్కం, ఆదంబాక్కం, వానువంపేట తదితర రైల్వేస్టేషన్ల నిర్మాణాలు ముగించి, వచ్చే పొంగల్‌కు రైలు సేవలు ప్రారంభించాలని నిర్ణయించినట్లు చెన్నై రైల్వే డివిజన్ అధికారి ఒకరు తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడి, టి.నగర్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార శిబిరం నిర్వహించనున్నారు. వ్యాసర్పాడి రామలింగం ఆలయం ఎదురుగా ఉన్న వ్యాసర్పాడి ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం,టి.నగర్ పరిధిలో కోడంబాక్కం హైరోడ్డు వళ్లువర్‌కోట్టం ఎదురుగా ఉన్న ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ శిబిరంలో, ఆయా ప్రాంతాలకు చెందిన వినియోగదారులు పాల్గొని విద్యుత్ సరఫరా, బిల్లులు, కరెంటు కోతలు సహా విద్యుత్ సంబంధిత అంశాలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కరూర్ తొక్కిసలాట ప్రాంతంలో 450 కిలోల బరువున్న పాదరక్షల సేకరణ





వేలుచ్చామిపురం వద్ద చెల్లాచెదురుగా పడి ఉన్న పాదరక్షలు, చెట్ల కొమ్మలు ఇనుపరేకులు - కరూర్ వేలుచ్చామిపురం వద్ద రహదారి పక్కగా పడి ఉన్న పాదరక్షలు

చెన్నై, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కరూర్ నగరం వేలుచ్చామిపురం వద్ద గత సెప్టెంబరు 27 రాత్రి టీవీకే నేత విజయ్ రోడ్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ప్రాంతంవద్ద వేల సంఖ్యలో చెల్లాచెదురుగా పడి ఉన్న 450 కిలోల బరువున్న పాదరక్షలను కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు బుధవారం సాయంత్రం తొలగించారు. కరూర్ తొక్కిసలాటలో చిన్నారులు, మహిళలు సహా 41 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ దుర్ఘటనలో వందమందికి పైగా గాయపడి వివిధ ఆసుపత్రులలో చికిత్సలందుకుని ఇటీవలే కోలుకున్నారు.ఈ సంఘటనపై ఓ వైపు హైకోర్టు ఆదేశం మేరకు ఏర్పాటైన ఐజీ అస్రాగార్గ్ నాయకత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు, మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ కమిటీ విచారణలు జరుపటంతో వేలుచ్చామిపురం వద్ద పడి ఉన్న పాదరక్షలను రహదారి పక్కగా చేర్చి అక్కడే నిల్వగా ఉంచారు. ఎంపీ, నటి హేమమాలిని నాయకత్వంలోనే ఎన్డీయే నిజనిర్ధారణ కమిటీ సభ్యులు, ఇతర విచారణ సంఘాలు ఆ ప్రాంతం వద్ద విచారణ జరుపుతూ వచ్చారు. ప్రస్తుతం అన్ని విచారణలు ఓ కొలిక్కి రావటంతో వేలుచ్చామిపురం వద్ద నున్న పాదరక్షలను బుధవారం సాయంత్రం పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించే లారీలో ఎక్కించి, బాలమ్మాళ్‌పురంలో ఉన్న కార్పొరేషన్ డంపింగ్ యార్డ్ వద్దనున్న గోదాములో భద్రపరిచారు. ముందుగా పారిశుధ్య కార్మికులు ఆ పాదరక్షలను తూనికలో వేసి, వాటి బరువు 450 కిలోలుగా ఉన్నట్లు నిర్ధారించారు. మలి విడత విచారణలో ఈ పాదరక్షలు అవసరమవుతాయి కనుక వాటిని జాగ్రత్తగా భద్రపరచినట్లు పారిశుధ్య విభాగం ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

మదురై ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు



మదురై ఎయిర్‌పోర్ట్ వద్ద ప్రయాణికుల లగేజీలను శునకాలతో తనిఖీ చేస్తున్న పోలీసులు

చెన్నై, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మదురై ఎయిర్‌పోర్ట్‌కు గురువారం ఉదయం బాంబు బెదిరింపు వచ్చింది. విమానాశ్రయ ఉన్నతాధికారి ముత్తుకుమార్‌కు గుర్తు తెలియని వ్యక్తి పంపిన ఈ మెయిల్ సందేశంలో మదురై ఎయిర్‌పోర్ట్‌లో బాంబులు పెట్టారని, అవి కాసేపట్లో పేలుతాయని పేర్కొన్నారు. వెంటనే ఆయన విమానాశ్రయ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసులు, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సభ్యులు, బాంబు స్క్వాడ్ నిపుణులు హుటాహుటిన వెళ్ళి మెటల్ డిటెక్టర్లు, జాగిలాలతో క్షుణ్ణంగా తనిఖీలు జరిపారు. విమానాశ్రయంలో ఉన్న ప్రయాణికుల లగేజీలను కూడా మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేశారు. విమానాశ్రయంలో వచ్చే వాహనాలను తనిఖీ చేసిన మీదటే లోపలికి అనుమతించారు. సుమారు గంట సేపు ఈ తనిఖీలు జరిగాయి. చివరకు అది ఉత్తుత్తి బెదిరింపేనని అధికారులు నిర్ధారించారు.

అండమాన్ వెళ్లేందుకు నిరాకరించిన మహిళ

ఆలస్యంగా బయల్దేరిన విమానం

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అండమాన్ వెళ్లేందుకు మహిళ నిరాకరించడంతో, నగరం నుంచి వెళ్లాల్సిన విమానం ఆలస్యంగా బయల్దేరి వెళ్లింది. నగరం నుంచి అండమాన్ వెళ్లేందుకు ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం 139 మంది ప్రయాణికులతో బుధవారం ఉదయం 10.45 గంటలకు సిద్ధంగా ఉంది. ఈ విమానంలో ప్రయాణించేందుకు అండమాన్‌కు చెందిన కల్పన (35) తిరుచ్చి నుంచి వచ్చారు. ఆమెను సాగనంపేందుకు బంధువులు విమానాశ్రయానికి వచ్చారు. టిక్కెట్ పరిశోధనలు ముగించి ఆమెకు 'బోర్డింగ్ పాస్' అందజేశారు. చివరి నిముషంలో ఆమె అండమాన్ వెళ్లేందుకు నిరాకరించింది. బంధువులు ఆమెను బలవంతంగా ప్రవేశ ద్వారం వద్దకు పంపించారు. అక్కడ, సీఐఎస్ఎఫ్ అధికారిని కలిసిన కల్పన, అండమాన్ వెళ్లేందుకు ఇష్టం లేదని, బలవంతంగా పంపిస్తున్నారని ఫిర్యాదు చేసింది. దీంతో, బోర్డింగ్ పాస్, టిక్కెట్లు రద్దు చేసిన అధికారులు, కల్పనను వెనక్కి పంపగా, ఆమె బంధువులతో కలసి తిరుచ్చికి బయల్దేరింది. ఈ కారణంగా, అండమాన్ వెళ్లాల్సిన విమానం 30 నిముషాలు ఆలస్యంగా బయల్దేరి వెళ్లింది.

జనావాసాలు, వీధులు, రోడ్లపై ఉన్న కుల పేర్లు తొలగింపు

మార్గదర్శకాలు రూపొందించాలని ఉత్తర్వులు

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జనావాసాలు, వీధులు, రోడ్లకు సూచించిన కులం పేర్లు తొలగింపునకు మార్గదర్శకాలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ఇందుకోసం స్థానిక ప్రజల అభిప్రాయాలు, ఆయా ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులు సమీక్షించాలి. ఆదిద్రావిడర్ కాలని, హరిజన్ కాలని తదితర పేర్లు మార్చాలి. అందుకోసం క్షేత్ర పరిస్థితి, క్షేత్రం వాస్తవికత ఆధారంగా ఈ పనులు జాగ్రత్తగా చేపట్టాలి. గ్రామీణ ప్రాంతాల విషయంలో, స్థానిక వాస్తవాల ఆధారంగా బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులు తయారుచేసిన జాబితాలను అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి జోనల్ అధికారి పూర్తిగా ధృవీకరించాలి. పట్టణ స్థానిక సంస్థల విషయంలో, స్థానిక వాస్తవాల ఆధారంగా కార్యనిర్వాహక అధికారులు, కమిషనర్లు తయారుచేసిన జాబితాలను సంబంధిత మున్సిపాలిటీల అసిస్టెంట్ డైరెక్టర్, జోనల్ డైరెక్టర్ ధృవీకరించాలి. జనావాసాలు, రోడ్లు, వీధులు, సాధారణ ఆస్తుల పేర్లు మార్పుకు జిల్లా గెజిట్‌లో నోటిఫికేషన్ ప్రచురించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు చేపట్టాలి. ఏవైనా అభ్యంతరాలు ఉంటే, నోటిఫికేషన్ ప్రచురించిన తేది నుంచి 21 రోజుల్లోపు లిఖితపూర్వకంగా అందజేసేలా అవకాశం కల్పించాలి. నిర్ణీత కాలంలోపు అందే అభ్యంతరాలు, వ్యాఖ్యలను క్షుణ్ణంగా విచారించాలి. పేర్ల మార్పుతో కూడిన జాబితాను ఆయా జిల్లా అధికారులు ప్రభుత్వానికి పంపించాలని సచివాలయం ప్రకటనలో తెలిపింది.

ఊటీలో రూ.40లక్షల వ్యయంతో 'డాగ్ పార్క్'



ఊటీలో డాగ్ పార్క్ ఏర్పాటు పనుల్లో కార్మికులు

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీలో 'డాగ్ పార్క్' ఏర్పాటుపనులు వేగంగా జరుగుతున్నాయి. పెంపుడు జంతువుల పట్టికలో శునకాలు ప్రథమస్థానంలో ఉన్నాయి. శునకాలు సంరక్షించే యజమానులు, ఉదయం, సాయంత్రం వేళల్లో వాటితో వాకింగ్‌కు వెళుతుంటారు. ఈ క్రమంలో, కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా శునకాల దాడిలో ప్రజలు గాయపడుతున్నారు. ఈ కారణంగా శునకాలను బయటకు తీసుకెళ్లడంపై పలు నిబంధనలు విధించారు. అలాగే, శునకాలను సంరక్షించే యజమానులు, తప్పక లైసెన్స్ తీసుకోవాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో, ఊటీకి విహార యాత్రకు వచ్చే పలువురు పర్యాటకులు, తాము పెంచుకుంటున్న శునకాలతో వస్తున్నారు. వాటిని పార్క్‌లు, బోట్ హౌస్ సహ పలు ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు అనుమతులు లేకపోవడంతో, ప్రత్యేక గది తీసుకుని వాటిని వదిలి వెళుతున్నారు. ఈ సమస్య పరిష్కరించేలా ఊటీలో రూ.40 లక్షల వ్యయంతో డాగ్ పార్క్ ఏర్పాటుపనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ పార్క్ ఆదరణ పెరిగితే, జిల్లావ్యాప్తంగా మరికొన్ని ప్రాంతాల్లో డాగ్ పార్క్‌లు ఏర్పాటుచేయనున్నట్లు జిల్లా కలెక్టర్ లక్ష్మి తెలిపారు.

పళని ఆలయంలో బంగారు ఊయల గది ప్రారంభం



పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పళని కొండ ఆలయంలోని బంగారు రథం నిలయం సమీపంలో బంగారు ఊయల గది పనిచేస్తోంది. ఈ గది పునరుద్ధరణ పనులు పూర్తికావడంతో, గురువారం ఉదయం ప్రత్యేక పూజతో బంగారు ఊయల గది ప్రారంభించారు. పళని కొండ ఆలయానికి వచ్చే భక్తులు తమ పిల్లలను బంగారు ఊయల తొట్టిలో ఉంచి మొక్కులు చెల్లిస్తుంటారు. అందుకోసం ఆలయ బంగారు రథం సమీపంలో బంగారు ఊయల గది పనిచేస్తోంది. ఈ బంగారు ఊయల గదిని పునరుద్ధరించాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించగా, అందుకు ఓ భక్తుడు రూ.45 లక్షలు విరాళంగా అందజేశాడు. పునరుద్ధరణ పూర్తికావడంతో, గురువారం ఉదయం ప్రత్యేక పూజతో బంగారు ఊయల గదిని ప్రారంభించారు.

నవంబర్ 18న జాక్టోజియో సమ్మె



మీడియాతో మాట్లాడుతున్న జాక్టోజియో నిర్వాహకులు

ప్యారీస్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ పథకాన్ని అమలుచేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే నవంబర్ 18న సమ్మె చేపట్టనున్నట్లు 'జాయింట్ యాక్షన్ కౌన్సిల్ ఆఫ్ తమిళనాడు టీచర్స్ ఆర్గనైజేషన్స్ అండ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఆర్గనైజేషన్' (జాక్టోజియో) ప్రకటించింది. స్థానిక చూలైమేడులో జాక్టోజియో రాష్ట్రస్థాయి నిర్వాహకుల సమావేశం ఆర్గనైజర్లు శ్రీనివాసన్, సురేష్, షణ్ముగనాథన్‌ల అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశం ఆమోదించిన తీర్మానాలను నిర్వాహకులు మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ఇచ్చిన హామీ అధికారంలోకి వచ్చిన తర్వాత పక్కనబెట్టారని, ఈ డిమాండ్‌ను అమలుచేయాలని గత నాలుగున్నరేళ్లుగా విన్నవించుకుంటున్నా.. స్పందన లేదని ఆరోపించారు. స్టాలిన్ ఇచ్చిన హామీని నమ్మి ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు డీఎంకేని గెలిపించాయని గుర్తుచేశారు. అప్పట్లో జాక్టోజియో ఆధ్వర్యంలో నిర్వహించిన మహానాడులో పాల్గొన్న సీఎం స్టాలిన్, తమ డిమాండ్లను ఆమోదిస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు నెరవేరలేదన్నారు. హామీల అమలులో విఫలమైన డీఎంకే ప్రభుత్వాన్ని ఖండిస్తూ వచ్చే 16వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, టీచర్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని తెలిపారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 18న జాక్టోజియోకు చెందిన 5 లక్షలకు పైగా తమ సభ్యులు సమ్మెలో పాల్గొంటారని హెచ్చరించారు.

ఘనంగా 'మదర్ థెరిసా' అవార్డుల ప్రదానోత్సవం



అవార్డు గ్రహీతలు

చెన్నై, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని సెయింట్ మదర్ థెరిసా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల కోయంబత్తూరులో 'మదర్ థెరిసా' అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. సామాజిక వ్యవస్థాపకత సాధనకు కృషి చేస్తున్న రొటేరియన్ అపర్ణసాంగుకు 'మదర్ థెరిసా' అవార్డును ప్రదానం చేశారు. అదే విధంగా వైద్యసాధనకు కృషి చేసిన డాక్టర్ కన్నన్ మహారాజ్‌కు, యువజన అభివృద్ధి, సాధికారత అవార్డును సంచిత శెట్టికి, సామాజిక సేవ, ప్రజా సేవకు పాటుపడుతున్న పోలీసు ఇన్‌స్పెక్టర్లు రాజ్‌కుమార్, లతకు, రాజకీయాల్లో మహిళాభివృద్ధికి కృషి చేస్తున్న మూకాంబికా రత్నంకు అవార్డులను ప్రదానం చేశారు. 'ఇండియన్ మీడియా వర్క్స్' చైర్మన్ జాన్ అమలన్ చేతుల మీదుగా ఈ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

ఆస్తిపన్ను అవినీతి కేసు


● మదురై మేయర్ భర్తకు బెయిలు



బెయిల్ పిటిషన్ విచారణకు పొన్‌వసంత్‌ను హాజరుపరుస్తున్న పోలీసులు

ప్యారీస్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను అవినీతి కేసులో మదురై కార్పొరేషన్ మేయర్ భర్తకు నిబంధనలతో కూడిన బెయిలును మంజూరు చేస్తూ మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. మదురై కార్పొరేషన్ మేయర్ ఇంద్రాణి భర్త పొన్‌వసంత్ కార్పొరేషన్ ఆస్తిపన్ను వ్యవహారంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ దాఖలైన కేసులో గత ఆగస్టు 12న అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పొన్‌వసంత్ తన న్యాయవాది తరుపున మదురై హైకోర్టు బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేయించారు. గురువారం ఈ పిటిషన్ న్యాయమూర్తి శ్రీమతి సమక్షంలో విచారణకు వచ్చింది. అప్పుడు మదురై కేంద్ర కారాగారం నుంచి పిటిషనర్‌ను భారీ భద్రతల మధ్య కోర్టులో హాజరుపరిచారు. పిటిషనర్, ప్రభుత్వ తరుపు న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం పొన్‌వసంత్‌కు నిబంధనలతో కూడిన బెయిల్ మంజూరైంది. బెయిలు గడువు పూర్తయ్యే వరకు మదురై ఆర్థికనేర విభాగం పోలీస్‌స్టేషన్‌లో ప్రతిరోజు సంతకం పెట్టాలని న్యాయమూర్తి ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమావేశం



సమావేశంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

వేలూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన గురువారం ఉదయం తమిళనాడు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యేలు కార్తికేయన్, అమ్ములు విజయన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషన్ అధ్యక్షుడు అరుణ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలకు పలు రకాల సంక్షేమ పథకాలను అమలుపరుస్తోందని, ప్రజలు కూడా వాటిపై అవగాహన కలిగి వుండాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మయిల్‌వాహనం, కమిషన్ ఉపాధ్యక్షుడు అబ్దుల్, నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'వోల్వో' బస్సును నడిపిన మంత్రి




వోల్వో బస్సును నడుపుతున్న మంత్రి శివశంకర్

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా సంస్థ వచ్చే ఏడాది పొంగల్ పండుగకు అధునాతన వసతులతో కూడిన 'వోల్వో' బస్సులను పరిచయం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం, ఆ శాఖ మంత్రి శివశంకర్ స్వయంగా వోల్వో బస్సును నడిపి తనిఖీ చేశారు. ఈ మేరకు మంత్రి శివశంకర్ తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేసిన వివరాలు ఇలా ఉన్నాయి... రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) ప్రయాణికులకు మెరుగైన సేవలు, సుఖవంత, సౌకర్యం, రక్షణ కలిగిన ప్రయాణాన్ని అందిస్తుందన్నారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉత్తర్వులతో, అధునాతన 'మల్టీ యాక్సిల్ వోల్వో' బస్సులు ఎస్ఈటీసీలో పరిచయం చేయనున్నామని తెలిపారు. అందుకోసం బెంగళూరులో ఉన్న వోల్వో బస్సు తయారీ సంస్థ కర్మాగారానికి నేరుగా వెళ్లి పరిశీలించనున్నారు. బస్సు డిజైన్, ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా లక్షణాలు క్షుణ్ణంగా పరిశీలించాను. అలాగే, బస్సు స్వయంగా నడిపానంటూ మంత్రి శివశంకర్ ఎక్స్ ద్వారా తెలిపారు.

27న తిరుచెందూర్‌లో శూరసంహారం వేడుకలు

ప్యారీస్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన తిరుచెందూర్ మురుగన్ ఆలయంలో ఈ నెల 27న శూరసంహారం జరుగుతుందని కలెక్టర్ ఇళంభగవత్ ప్రకటించారు. ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలోని శైవక్షేత్రాల్లో పేరెన్నికగన్న తిరుచెందూర్ ఆలయం సమీపంలోని సముద్రతీరంలో నిర్వహించనున్న శూరసంహారం వేడుకలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి సుమారు 5లక్షల మంది భక్తులు పాల్గొంటారని, దాదాపు 4వేల మంది పోలీసులు భద్రతా విధులు నిర్వహిస్తారని సమాచారం.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే పరిశీలన



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని పొదటూరుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఉదయం తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను సంప్రదించి ఆస్పత్రి వసతులు, సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బంది ఏ మేరకు విధులకు హాజరవుతున్నారో అటెండెన్స్ రిజిస్టర్‌ను చూసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎంకే పొదటూరుపేట యూనియన్ కార్యదర్శి రవీంద్రన్, పలుశాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసులో అన్నదమ్ములకు యావజ్జీవం

అడయార్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కరూర్ జిల్లాలో ఒక యువకుడిని హత్య చేసిన కేసులో అన్నదమ్ములకు కోర్టు యావజ్జీవకారాగార శిక్ష విధిస్తూ తాజాగా తీర్పునిచ్చింది. జిల్లాలోని మహాదానపురానికి చెందిన అరుణ్ కుమార్ (23) అనే యువకుడిని ఇదే జిల్లాలోని నత్తన్‌కోటకు చెందిన అన్నదమ్ములు పెరియస్వామి (29), వినోద్ (27)లు గత 2021 అక్టోబరు 29వ తేదీన చిన్నపాటి తగాదా కారణంగా హత్య చేశారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి పెరియస్వామి, వినోద్‌లను అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ కరూర్ జిల్లా మేజిస్ట్రేట్ కోర్టులో సాగగా, కేసులోని సాక్ష్యాదారాలను పరిశీలించిన న్యాయమూర్తి ఇలవళగన్ బుధవారం తీర్పునిచ్చారు. అరుణ్ కుమార్‌ను హత్య చేసిన అన్నదమ్ములతో పాటు వీరికి సహకరించిన స్నేహితుడు ఆనంద్ (27)కు కూడా రెండుయావజ్జీవకారాగార శిక్షలను విధిస్తూ తీర్పునిచ్చారు. తీర్పు అనంతరం ఈ ముగ్గురు ముద్దాయిలను తిరుచ్చి సెంట్రల్ జైలుకు తరలించారు.

మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు ఎస్పీని సంప్రదించండి

టీవీకే పార్టీకి డీజీపీ సూచన

ప్యారీస్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కరూర్ రోడ్‌షోలో ప్రాణాలు కోల్పోయిన 41 కుటుంబీకులను పరామర్శించేందుకు ఆ జిల్లా ఎస్పీని సంప్రదించి అనుమతి పొందాల్సిందిగా తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు డీజీపీ కార్యాలయం సూచించింది. గత నెల 27వ తేదీన కరూర్ వేలుచామిపురంలో టీవీకే అధ్యక్షుడు విజయ్ రోడ్‌షోలో పాల్గొనప్పుడు తొక్కిసలాట జరిగి 41 మంది దుర్మరణం చెందగా, 110 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, కరూర్ బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు తగు సన్నాహాలు చేపడుతున్నారు. ఆ దిశగా ఆయన తరుపు న్యాయవాదులు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం విజయ్ తరుపు న్యాయవాది అరివళగన్ స్థానిక మైలాపూర్‌లో ఉన్న డీజీపీ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. అందులో విజయ్ కరూర్‌లో పర్యటించనున్న తేదీలు ఉన్నట్లు సమాచారం. ఇదిలా వుండగా, విజయ్ పర్యటనకు అనుమతి, భద్రతకు సంబంధించి జిల్లా ఎస్పీని సంప్రదించి అనుమతి పొందాల్సిందిగా డీజీపీ కార్యాలయం టీవీకేకు సూచనలిచ్చింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి... **మైలాపూర్:** టీటీకే రోడ్డు, భీమన్న ముదలి 1, 2 వీధులు, సీవీ రామన్ రోడ్డు, సీపీ రామస్వామి రోడ్డు, భీమన్న గార్డన్ రోడ్డు, పావా రోడ్డు, ఆనంద రోడ్డు, డా.రెంగార్డ్, ఆనందపురం, అశోక వీధి, శ్రీలబ్ది కాలని, సుందరరాజన్ వీధి, సుబ్రమణియం వీధి, కన్నికోయిల్ దిగువ, ఎగువ ప్రాంతాలు, విశాలాక్షి గార్డన్, సుబ్బురాయన్ రోడ్డు, నరసింహపురం, సెయింట్ మేరీస్ రోడ్డు, ఆర్ఏ పురం, వీకే అయ్యర్ రోడ్డు, శ్రీనివాస రోడ్డు, వారన్ రోడ్డు, వెంకటేశ అగ్రహారం, జెత్ నగర్ 1 వీధి, వెస్ట్ మాతా నగర్, టీవీపేట వీధి, వీనాయకం వీధి, వీసీ గార్డెన్ 1 నుంచి 3 వీధులు, ట్రస్ట్ పాక్కం వెస్ట్, ఈస్ట్ రోడ్లు, సీతమ్మాళ్ కాలని, జేజే రోడ్డు, ఎల్డామ్స్ రోడ్డు, శ్రీమాన్ శ్రీనివాస రోడ్డు, ముర్రేస్ గేట్ రోడ్డు, పార్థసారధి గార్డెన్ వీధి, ఆళ్వార్‌పేట మెయిన్ రోడ్డు, పెరుమాళ్ ఆలయ వీధి

తిరుమంగళం: అన్నానగర్ వెస్ట్ మరియు ఎక్స్‌టెన్షన్, డబ్ల్యూ బ్లాక్ బీసీ, డీ సెక్టార్, 11 నుంచి 20 మెయిన్ రోడ్లు, ఎమరాల్డ్ క్లాసిక్ అపార్ట్‌మెంట్, శేషాద్రి నగర్, వెల్‌కమ్ కాలని 1 నుంచి 49ఏ, టీవీ నగర్, జేఎన్ రోడ్డు, ఆసియాడ్ కాలని, సింధు అపార్ట్‌మెంట్, మంగళం కాలని, జవహర్ కాలని, శక్తి కాలని, పాత్ ఎల్ బ్లాక్ నుంచి జెడ్ బ్లాక్ వరకు, ఏఎస్ బ్లాక్ 4వ అవెన్యూ, పాత తిరుమంగళం, 11,12,15 మెయిన్ రోడ్లు, ఎఫ్ బ్లాక్ 2వ అవెన్యూ, సి బ్లాక్, నెహ్రూ నగర్, ఏఈ బ్లాక్

పట్టాభిరామ్: భారతియార్ నగర్, దీనదయాళన్ నగర్, నవజీవన్ నగర్, ఐఏఎఫ్ కాలని, సత్రం స్కూల్ రోడ్డు, దేవరాజపురం, గాంధీ నగర్; చోళన్ నగర్, పోలీస్ క్వార్టర్స్, కక్కంజి నగర్, తిరువళ్లువర్ నగర్, పీజీ అపార్ట్‌మెంట్స్

బీసెంట్ నగర్: 4వ అవెన్యూ, ఊరూర్ ఓల్కాట్ కుప్పం, దామోదరపురం, వెంకటరత్నం నగర్, కర్పగం గార్డన్, జీవరత్నం నగర్, బీసెంట్ అవెన్యూ, అరుణాచలపురం, వసంత ప్రెస్ రోడ్డు, బ్రిడ్జి రోడ్డు

తిరుముల్లైవాయల్: పాండేశ్వరం, మాగరల్, కుళక్కుంబేడు, తామరైపాక్కం, కారణి, సరస్వతి నగర్, సీటీహెచ్ రోడ్డు, ఆర్తీ నగర్, వివేకానంద నగర్, దేవి ఈశ్వరి నగర్, తెన్రల్ నగర్, సెంథిల్ నగర్, జేపీ నగర్, జ్యోతి నగర్, శ్రీ శక్తి నగర్, పవర్‌లైన్ రోడ్డు

ఆవడి: గాంధీ నగర్, వీవీ పురం, ఆవడి బస్టాండ్ మరియు డిపో, హెచ్‌వీఎఫ్ రోడ్డు, ఓసీఎఫ్ రోడ్డు. **టీజీ సైకిల్స్:** తిరువేంగడ నగర్, వివేక్ నగర్.

చిత్రజ్యోతి



కెమెరా ముందు నిల్చొని 22 ఏళ్లు

● నయనతార

స్టార్ హీరోయిన్ నయనతార చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి 22 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఒక పోస్ట్ పెట్టారు. 'కెమెరా ముందు తొలిసారి నిల్చొని నేటికి 22 ఏళ్లు అయింది. సినిమానే నా ప్రపంచంగా మారుతుందని అపుడు తెలియదు. అది తెలియకుండానే పరిశ్రమలోకి అడుగుపెట్టాను. ఆ తర్వాత ప్రతి షాట్, ప్రతి ఫ్రేమ్, ప్రతి సంఘటన, ప్రతి నిశ్శబ్దం నన్ను పూర్తిగా మార్చేశాయి. నాకు ఎంతో ధైరాన్ని ఇచ్చాయి. ఈ 22 ఏళ్ల జర్నీలో నాకు తోడుగా, అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ రుణపడివుంటాను' అని నయనతార తన నోట్‌లో పేర్కొన్నారు. కాగా, నయనతార 2003లో మలయాళ చిత్రం 'మనస్సినక్కరే' అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే.

సోనియా అగర్వాల్ ప్రధాన పాత్రలో 'విల్'

ఎస్.శివరామన్ దర్శకత్వంలో సోనియా అగర్వాల్ - విక్రాంత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'విల్'. కోర్టు డ్రామా మూవీగా రూపొందించారు. దీపావళికి విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్ర బృందం నగరంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసింది. ఇందులో దర్శకుడు శివరామన్ మాట్లాడుతూ, 'కోర్టులో జరిగిన ఒక వాస్తవ సంఘటనను మా ఎడిటర్ వద్ద చెప్పగా, ఆయన సలహా మేరకు ఇది ఒక చిత్రంగా రూపుదిద్దుకుంటుంది. ఇందులో జడ్జిగా సోనియా అగర్వాల్‌ను ఎంపిక చేశాం. ఈ మూవీ ద్వారా సోనియా సోదరుడు సౌరభ్ అగర్వాల్‌ను సంగీత దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం. ఈ స్టోరీ ఒక వీలునామాకు సంబంధించింది. అనేక కుటుంబాల్లో వీలునామాలు పలు సమస్యలకు కారణంగా ఉన్నాయి. విక్రాంత్ ఇన్వెస్టిగేటివ్ ఆఫీసరుగా నటించారు. అలేఖ్య ఇతరులు చేయడానికి ఇష్టపడని పాత్రలో నటించేందుకు ముందుకు వచ్చారు. ఆమె పాత్ర ఫుల్‌లెంగ్త్ యాక్షన్‌గా ఉంటుంది. ఇది ఒక కోర్టు డ్రామా మూవీగా రూపొందిస్తున్నప్పటికీ ఒక ఫీల్ గుడ్ మూవీగా ఉంటుంది' అని పేర్కొన్నారు. నటి సోనియా అగర్వాల్ మాట్లాడుతూ, 'ఇది నా కెరీర్‌కు ఎంతో ముఖ్యమైన సినిమా. నా తమ్ముడు ఈ చిత్రం ద్వారా మ్యూజిక్ డైరెక్టరుగా పరిచయమవుతున్నారు. దర్శకుడు శివరామన్‌తో కలిసి ఒక చిత్రంలో నటించాను. ఆయన ప్రజల సాధారణ జీవన ప్రయాణాన్ని వివరిస్తారు. పైగా ఒక న్యాయవాది. అందుకే ఈ స్టోరీని అద్భుతంగా తీర్చిదిద్దారు. సినిమాల్లో చిన్న పెద్దా అనే లేదు. 'కాదల్ కొండేన్' సినిమా కోటి రూపాయల వ్యయంతో తీశారు. అది బ్లాక్‌బస్టర్ హిట్ మూవీగా నిలిచింది. ప్రజలకు ఎలాంటి కథ నచ్చుతుందో వారికి బాగా తెలుసు. వీలునామాలోని సమస్యలు, ఒక మహిళ త్యాగాన్ని ఒక అందమైన మూవీగా దర్శకుడు తెరకెక్కించారు' అని వివరించారు.


విలేకరుల సమావేశంలో శివరామన్, సోనియా అగర్వాల్, అలేఖ్య

ఒక న్యాయ విద్యార్థి పోరాటమే 'ఈగై'

ఒక న్యాయ కళాశాల విద్యార్థి చేసే పోరాటాన్ని ఇతివృత్తంగా చేసుకుని రూపొందిస్తున్న చిత్రం 'ఈగై'. గతంలో అనేక చిత్రాలకు అసిస్టెంట్ దర్శకుడుగా పనిచేసిన అశోక్ వేలాయుధం ఈ చిత్రానికి దర్శకుడు. ఈ సినిమా విశేషాలను ఆయన గురువారం వివరిస్తూ, 'గతంలో పలు భాషల్లో అనేక చిత్రాలకు అసిస్టెంట్ దర్శకుడుగా పనిచేశాను. ఇపుడు ఈ చిత్రాన్ని సొంతంగా తెరకెక్కిస్తున్నాను. చెన్నై, ముంబై, హైదరాబాద్ వంటి పలు ప్రాంతాల్లో 33 రోజుల పాటు చిత్రీకరణ చేశాం. చివరి దశ షూటింగులో ఫ్లాష్‌బ్యాక్, క్లైమాక్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది. ఇందులో 'రోషన్ కనకరాజ్ అనే పాత్రలో నటించాను. మార్క్ అనే విలన్ పాత్రను తెలుగు నటుడు సునీల్ పోషించారు. ప్రతి నాయకుడి పాత్రలో సునీల్‌కు ఈ మూవీ ఒక టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుంది. అరువి బాలా, రూబిన్‌తో సహా 25 మంది కొత్త ముఖాలు ఈ చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమవుతున్నారు. ఇది ఒక లేడీ ఓరియంటెడ్ మూవీ కావడంతో హీరోయిన్‌గా అంజలి నటించారు. సంతోష్ పతాప్, అర్జయ్, పొన్‌వణ్ణన్, హరీష్ పేరడి, అభిరామి, దీపా, పుగళ్ తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు. 'పరియేరుమ్ పెరుమాళ్' చిత్రానికి కెమెరామెన్‌గా పని చేసిన శ్రీధర్ సినిమాటోగ్రఫీ అందించారు. సంగీతం ధరణి కుమార్. సామాజిక న్యాయం, నేటి రాజకీయాలు, ఆర్థిక శాస్త్రంపై పట్టున్న విద్యార్థి చేసే పోరాటమే ఈ చిత్ర కథ' అని వివరించారు.


'ఈగై'లో ఓ దృశ్యం



మాది అస్సాం - మాతృభాష నేపాలీ : కయదు లోహర్

మా తల్లిదండ్రులది అస్సాం, కానీ తన మాతృభాష మాత్రం నేపాలీ అని హీరోయిన్ కయదు లోహర్ చెప్పారు. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన 'డ్రాగన్' మూవీ ద్వారా తమిళ ప్రేక్షకులకు పరిచయమైన ఈ భామ ఇపుడు ఏకంగా ఐదు చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, 'తెలుగు, తమిళం, హిందీ భాషల్లో కలిసి ఐదు చిత్రాల్లో నటిస్తున్నాను. తమిళంలో మరికొన్ని చిత్రాల్లో నటించేందుకు సంప్రదింపులు జరుగుతున్నాయి. ఇంకా ఫైనల్ కాలేదు. మా తల్లిదండ్రులది అస్సాం. కానీ, నా మాతృభాష నేపాలీ. పూణెలో పెరిగాను. తాను వెడ్డింగ్ ధరించేందుకు సిద్ధంగానే ఉన్నానని, కానీ, ఆ శుభతరుణం కోసం ఎదురు చూస్తున్నానని పేర్కొన్నారు. ఇదిలావుంటే, అధర్వ మురళి హీరోగా నటిస్తున్న 'ఇదయం మురళి' సినిమాలో ఆమె నటిస్తున్నారు. అలాగే జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటించే మరో చిత్రలో నటించనున్నారు. సుందర్ సి దర్శకత్వంలో విశాల్ హీరోగా నటించే కొత్త చిత్రంలో కూడా ఆమెను ఎంపిక చేయనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.


48 అడుగుల ఎత్తు మునీశ్వరుడి విగ్రహం


అంకాళేశ్వరీ మునీశ్వరాలయం వెలుపలి ప్రాకారం

చెన్నై ఈకాట్టుతాంగళ్ వద్ద బర్మాకాలనీ ప్రాంతంలో అడయార్ నది ఒడ్డున అత్యంత విశాలమైన మైదానంలో ఉన్న అంకాళేశ్వరీ మునీశ్వరాలయం భక్తులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని, ధైర్యాన్ని ప్రసాదించే దివ్యక్షేత్రంగా కీర్తిగడించింది. ఈ ప్రాచీన ఆలయం ఇటు భక్తులను, అటు పర్యాటకులను ఆకట్టుకునే రీతిలో నిర్మితమై ఉండటం విశేషం. మొట్టమొదట ఈ ప్రాంతంలో అంకాళేశ్వరి ఆలయం ఉండేదని, ఆ తర్వాత ఆ ఆలయ ప్రాంగణానికి చేరువగా మునీశ్వరుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు.

అయ్యనార్ ఆలయ తరహాలో

అంకాళీశ్వరాలయం

ఆకట్టుకునే 48 అడుగుల మునీశ్వర విగ్రహం


- టి.నగర్, ఆంధ్రజ్యోతి

ఆధ్యాత్మికం


లింగమేనితో ముఖారవిందంతో ఉన్న పరమేశ్వరుడి విగ్రహం

అంకాళేశ్వరి ఆలయాన్ని ఆనుకుని ఉన్న 48 అడుగుల ఎత్తు కలిగిన మునీశ్వరుడి విగ్రహం ఆకట్టుకుంటుంది. ఈ విగ్రహం వెనుక భాగంలో అందమైన 'వృషభకుంజరం' అనే కుడ్య శిల్పం చూపరులను బాగా ఆకట్టుకుంది. ఎడమవైపున చూస్తే ఓ అందమైన ఎద్దు ఆకారం కనిపిస్తుంది. కుడివైపు నుంచి చూస్తే ఈ విగ్రహమే ఏనుగు రూపంలో కనిపిస్తుంది. ఈ రూపాన్ని చూసే మెరీనాబీచ్ లైట్‌హౌస్‌ను ఆనుకుని ఉన్న స్థానిక పోలీసుస్టేషన్ గోడపై ఇలాంటి శిల్పాన్నే ఏర్పాటు చేశారు. ఈ మునీశ్వరుడి విగ్రహ ప్రాంతానికి ఎదురుగా కాస్త దూరంగా ఎత్తయిన అశ్వ విగ్రహం కూడా ఉంది. ఈ విగ్రహం అయ్యనార్ ఆలయాల్లో ఉన్నట్లు చాలా గాంభీర్యంగా దర్శనమిస్తుంది. ఈ విగ్రహం పెద్ద మునీశ్వరుడి ఎత్తును కలిగి ఉండటం విశేషం. ఈ విగ్రహం దిగువ పీఠంలో దేవతలు, రాక్షసుల క్షీరసాగర మధన ఘట్టం తెలిపే శిల్పాలు చెక్కి ఉన్నాయి. ఈ పెద్ద మునీశ్వరుడి ముందు చిన్న మునీశ్వరుడి సన్నిధి ఉంది. ప్రధానమైన మునీశ్వరుడి కుడిచేతిలో పెద్ద వేటకొడవలి ఉంది. ఈ కొడవలి సుమారు 10 అడుగుల ఎత్తు కలిగి ఉంది. ఎడమచేయి దిగువన అందమైన గద ఉంది. ఇక ప్రధానమైన గర్భాలయంలో వినాయకుడు, అంకాళేశ్వరి, కాళీమాత విగ్రహాలు వరుసగా ఉన్నాయి. కుడ్యంపై వినాయకుడు, దక్షిణామూర్తి, మహావిష్ణు, బ్రహ్మ, దుర్గాదేవి కొలువై ఉన్నారు. వెలుపలి ప్రాకారంలో మదురై వీరన్, వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి అందంగా దర్శనమిస్తున్నారు. అంకాళేశ్వరి సన్నిధి ప్రవేశద్వారంలో అన్నపూర్ణమ్మ, సరస్వతీదేవి కుడ్య శిల్పాలు ఉన్నాయి.


నందీశ్వరుడు


పెద్ద మునీశ్వరుడి వెనుకవైపు దిగువ పీఠంపై ఉన్న 'వృషభకుంజరం'

బర్మా మన్నుతో మునీశ్వరుడి విగ్రహం...

ఈ ఆలయం వద్దనున్న మునీశ్వరుడి విగ్రహం తయారీకి బర్మా (ఇప్పటి మియన్మార్)నుండి టన్నుల కొద్దీ మట్టిని తీసుకువచ్చారని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో బర్మావాసులు అధికంగా నివసించడంతో ఈ ప్రదేశానికి బర్మా కాలనీ అనే పేరొచ్చింది. మునీశ్వరుడి ఎత్తయిన విగ్రహాన్ని సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో నుంచే భక్తులు తిలకించి పరవశం చెందుతారు. చేతులెత్తి ఆ స్వామికి మొక్కుతారు. ఇక ఆలయ వెలుపలి ప్రాకారంగా ఎలాంటి ప్రహరీగోడలు లేకుండా ఉన్న ఈ మైదాన ప్రాంతంలో ఓ చోట చిన్న పీఠంపై నిలిచిన భంగిమలో ఉన్న చిన్న మునీశ్వరుడి చుట్టూ శూలాయుధాలు, పొడవైన వేటకొడవళ్లు కూడా ఉన్నాయి. ఈ చిన్న విగ్రహం కూడా భక్తులను భయపెట్టేలా ఉంది. ఆలయానికి తూర్పుదిశగా పరమేశ్వరుడు లింగమేనితో పవిత్రరూపంతో దర్శనమిస్తున్నారు. అయితే ఈ పరమేశ్వరుడు మీసంతో, గడ్డంతో కాస్త గాంభీర్యంగా భక్తులకు కనువిందు చేస్తారు. ఆ స్వామివారికి ఎదుట కాస్త దూరంలో ప్రత్యేక పీఠంపై నందీశ్వరుడి విగ్రహమూ ఉంది. రాజగోపురమంటూ ఏదీ లేని అంకాళేశ్వరి ఆలయ ప్రవేశ ద్వారంపై వివిధ దేవతామూర్తుల విగ్రహాలు అందంగా చెక్కబడి ఉన్నాయి. మహావిష్ణువు, పరమేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామివారి లీలా విశేషాలను తెలిపే దృశ్యాలను కూడా ఈ ప్రవేశద్వారంపై శిల్పరూపాలుగా కనువిందుచేస్తాయి. ప్రవేశద్వారం దాటుకుని లోపలకు వెళితే ముఖమండపం పైకప్పులో త్రీడీ ఆకారంలో సర్పాలు నేలమీదకు దూసుకువచ్చే రీతిలో కనిపించి భయపెడతాయి. గర్భాలయం వెనుకవైపున నాగతమ్మన్ సన్నిధి కూడా ఉంది. ఈ సన్నిధికి చేరువగానే షణ్ముఖుడి సన్నిధి. ఈ సన్నిధిలో సుబ్రహ్మణ్యస్వామివారి ఆరు విగ్రహరూపాలు భక్తులను పరవశింపజేస్తాయి. ఈ ఆలయం వద్ద తమిళ సినిమాలు, సీరియళ్ల షూటింగ్‌లు కూడా జరుగుతుంటాయి. రాఘవలారెన్స్ నటించిన 'ముని' చిత్రంలో ఓ పాటను ఇక్కడి మునీశ్వరుడి విగ్రహం వద్దే షూట్ చేశారు. ఈ ఆలయంలో ఉత్సవాలకు కొదువలేదు. అంకాళపరమేశ్వరీ ఆలయాల్లో జరుగుతున్నట్లే ఆషాడ మాసాల్లో ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆలయంలో జరిగే అగ్నిగుండ ప్రవేశ వేడుకల సందర్భంగా ఈ ఆలయ మైదానంలో పర్యాటక ప్రాంతాన్ని తలపించేలా భారీ రంగుల రాట్నాలు, కృత్రిమ సరస్సులు, ఈత కొలనులు, తాత్కాలిక ఫుడ్ స్టాల్స్ ఏర్పాటవుతాయి. ఆ సందర్భంగా వేల సంఖ్యలో నగరవాసులు ఈ ఆలయాన్ని దర్శించేందుకు తరలివస్తారు.


శూలాయుధాలు, ఖడ్గాల నడుమ చిన్న మునీశ్వరుడు


పెద్ద మునీశ్వరుడి దిగువ పూజలందుకునే మూలవిరాట్టు

ఎలావెళ్లాలి?...

నగరం నలుమూలల నుంచి నందబాక్కంకు సిటీ బస్సులు వెళతాయి. నందంబాక్కంలో బస్సు దిగి మిలటరీ ఆసుపత్రి - బర్మాకాలనీ రహదారిలో పది నిమిషాల నడకతో ఈ ఆలయ ప్రాంతానికి చేరుకోవచ్చు. ఇదే విధంగా సిటీ బస్సులలో ఈక్కాట్టు తాంగళ్‌కు వెళ్లి అక్కడ కలైమగళ్‌నగర్ - బర్మాకాలనీ రహదారిలో నడిచి ఆలయానికి వెళ్లవచ్చు. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 5 నుంచి సాయంత్రం 7గంటల దాకా తెరచి, భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

17న అన్నాడీఎంకే ఆవిర్భావ దినోత్సవం

● రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు, బహిరంగసభలు

● ఎడప్పాడి పళనిస్వామి ప్రకటన



ప్యారీస్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 17వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. ఈ నెల 17వ తేదీన అన్నాడీఎంకే 54వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు, బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీపరంగా విభజించిన 82 జిల్లాలు, పుదుచ్చేరి కారైక్కాల్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, న్యూఢిల్లీ, కర్నాటక, మహారాష్ట్ర, అండమాన్ తదితర ప్రాంతాల్లో ఉన్న పార్టీ నిర్వాహకులకు ఆయన ఈ మేరకు గురువారం లేఖ రాశారు. పార్టీ జిల్లా కార్యదర్శులు తమ జిల్లాల్లో నిర్వహించనున్న బహిరంగ సభలు, వేడుకల వివరాలను పార్టీ కార్యాలయానికి పంపించాలని సూచించారు. తొలిరోజైన 17వ తేదీన దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు, వారి ఫొటోలకు పూలుచల్లి నివాళులర్పించాలని, పేదలకు అన్నదానం, సంక్షేమ సహాయాలు పంపిణీ చేయాలని సూచించారు. మరుసటి రోజైన 18వ తేదీన అన్నాడీఎంకే ప్రభుత్వాలు గతంలో విజయవంతంగా అమలు చేసిన వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని తన లేఖలో దిశానిర్దేశం చేశారు.

మదురైలో క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభించిన ధోని


ప్రారంభోత్సవంలో ధోని పాల్గొన్న దృశ్యాలు

ప్యారీస్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు క్రికెట్ సంఘం సహకారంతో మదురైలో వేలమ్మాళ్ విద్యాసంస్థ నిర్మించిన క్రికెట్ గ్రౌండ్‌ను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని గురువారం ప్రారంభించారు. మదురై చింతామణి రింగురోడ్డు ప్రాంతంలో వేలమ్మాళ్ ఆస్పత్రి వద్ద 11.50 ఎకరాల విస్తీర్ణంలో క్రీడాకారుల విశ్రాంతి గదులు, జిమ్, అంబులెన్స్, ఆస్పత్రి, కార్ పార్కింగ్ తదితరాలను అత్యాధునిక వసతులతో రూ.325 కోట్ల వ్యయంతో నిర్మించారు. వర్షం కురిస్తే నీరు వెంటనే బయటికి వెళ్లే విధంగా వసతులు సమకూర్చారు. 25వేల మంది అభిమానులు కూర్చొని మ్యాచ్‌ను తిలకించేలా గ్యాలరీని ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. తొలి విడతగా 7,300 కుర్చీలు ఏర్పాటు చేశారు. గ్రౌండ్ చుట్టూ 192 సీసీటీవీ కెమెరాలు పొందుపరిచారు. స్థానిక చేపాక్ చిదంబరం క్రికెట్ స్టేడియం తర్వాత రాష్ట్రంలో ఇది రెండవ అతిపెద్ద క్రికెట్ స్టేడియం కావడం గమనార్హం. భవిష్యత్తులో ఇక్కడ టీఎన్‌పీఎల్, ఐపీఎల్, రంజీ తదితర పోటీలు నిర్వహించే అవకాశముంది.

5,478 మందికి ప్రభుత్వ సహాయాల పంపిణీ

ప్యారీస్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలో గురువారం ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యక్రమంలో 5,478 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం తరుపున సంక్షేమ సహాయాలను డిప్యూటీ సీఎం ఉదయనిధి పంపిణీ చేశారు. ఆయన దిండుగల్ జిల్లాలో పూర్తిచేసిన 39 పథకాలను ప్రారంభించి, మరో 23 కొత్త పథకాలకు రాష్ట్ర మంత్రులు గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఐ.పెరియస్వామి, సహకారశాఖ మంత్రి కేఆర్.పెరియకరుప్పన్, పౌరసరఫరాలశాఖ మంత్రి ఆర్.చక్రపాణిలతో కలిసి శంకుస్థాపన చేశారు. నాబార్డ్ పథకం కింద ప్రభుత్వ పాఠశాలలో నూతన తరగతి గదులు, వేడచెందూర్ ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన అత్యవసర చికిత్సా విభాగం, గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాల శాఖల తరుపున పూర్తిచేసిన పథకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎస్‌జ్యోతిమణి, ఎమ్మెల్యేలు సెంథిల్‌కుమార్, గాంధీరాజన్, జిల్లా కలెక్టర్ ఎస్.శరవణన్, ఎస్పీ ప్రదీప్, డీఆర్‌వో జయభారతి, పలుశాఖల ఉన్నతాధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు స్కూటర్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి, రాష్ట్ర మంత్రులు

వినూత్న ఆవిష్కరణలకు చేయూత

● ఎంటీసీ ఎండీ ప్రభుశంకర్



ఆటోసర్వ్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖులు

అడయార్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వృద్ధి, ఆవిష్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ టి.ప్రభుశంకర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక నందంబాక్కంలోని ట్రేడ్‌సెంటర్‌లో ఏర్పాటైన సీఐఐ ఆటో సర్వ్ 11వ ఎడిషన్‌ను లాంఛనంగా ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమిళనాడు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన రాష్ట్రమని, దేశంలోనే అత్యధిక కర్మాగారాలు, ఎంఎస్ఎంఈలను కలిగివున్న రాష్ట్రం తమిళనాడేనని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంకా డాన్ఫాస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ డిప్యూటీ చైర్మన్, ప్రెసిడెంట్ పి.రవిచంద్రన్, సీఐఐ ఇంటర్నేషనల్ ఆటోటెక్ కాన్ఫరెన్స్ చైర్మన్, ఎండీ దేబాషిస్ నియోగి, రాకేష్ ఖేర్ తదితరులు కూడా పాల్గొన్నారు.

రామస్వామి ఉడయార్ ఇంటర్ స్కూల్ డిబేట్‌కు విశేష స్పందన

అడయార్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): 'శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' ఆధ్వర్యంలో గురువారం 'ఎస్ఎస్‌పీవీ రామస్వామి ఉడయార్ ఇంటర్ స్కూల్ డిబేట్' నిర్వహించింది. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలకు చెందిన 25 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో సంభాషణ, తార్కికం, నిర్మాణాత్మక ఆలోచనను బాలబాలికల్లో పెంపొందించాలన్న లక్ష్యంతో 'శ్రీ రామచంద్ర ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్' నిర్వహించిన ఈ పోటీల్లో స్థానిక వలసరవాక్కంలోని దేవి అకాడమీ సీనియర్ సెకండరీ స్కూలు విద్యార్థులు ఎం.శర్మేష్, బి.నితీష్ నరసింహన్ ప్రథమ బహుమతిని, వేలమ్మాళ్ బోధి క్యాంపస్‌కు చెందిన కౌశిక్ కన్న, వికాస్ శ్రీనివాసన్ ద్వితీయ బహుమతిని, నికేతన్ పాఠశాలకు చెందిన రాఘవన్, అరవింద్ ఠాకూర్ తృతీయ బహుమతిని దక్కించుకున్నారు. శ్రీ రామచంద్ర ఎడ్యుకేషనల్ అండ్ ట్రస్ట్ ట్రస్టీ సంయుక్త వెంకటాచలం, వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఉమాశేఖర్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సైన్సెస్ ఫ్యాకల్టీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సెల్వం జెసయ్య తదితరులు కూడా పాల్గొన్నారు.


విజేతలకు సత్కారం

రైల్లో నుంచి జారిపడి ఇంటర్ విద్యార్థి మృతి

నాయుడుపేట టౌన్/వరదయ్యపాళెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైల్లో నుంచి జారిపడి ఇంటర్ విద్యార్థి సంతోష్(17) మృతి చెందాడు. వరదయ్యపాళెంలోని బజారు వీధిలోని పరంధామయ్య కుమారుడు సంతోష్ నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఇతడు.. తిరిగి కళాశాలకు వెళ్ళేందుకు తడలో రైలు ఎక్కాడు. నాయుడుపేట స్టేషన్ సమీపంలో రైల్లో నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంతోష్ (ఫైల్ ఫొటో)

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ రామాంజనేయులు, సినీ దర్శకుడు వీవీ వినాయక్, నటి రోహిణి, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, తెలంగాణ శివశక్తుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ శ్యామలాదేవి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



వివి వినాయక్ - రోహిణి


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.93 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,861

తలనీలాలు సమర్పించినవారు: 31,802





తరునీష్ జత్యా


ఇష్టపడిన రంగంలో కష్టపడితే ఫలితాలెలా ఉంటాయో నిరూపిస్తున్నాడు తరునీష్ జత్యా. తనకు నచ్చిన విలువిద్యపై ఫోకస్ పెట్టి బాణంలా దూసుకుపోతున్నాడీ కుర్రాడు. అర్జునుడిలా విల్లు ఎక్కి పెట్టి లక్ష్య ఛేదనలో చక్కగా రాణిస్తున్నాడు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ పతకాలను సొంతం చేసుకుంటున్నాడు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

గురి తప్పని తరునీష్

- విలువిద్యలో చక్కని ప్రతిభ
- ఒలింపిక్ లక్ష్యంగా పరిశ్రమ

గూడూరు పట్టణంలోని ధూర్జటినగర్ ప్రాంతానికి చెందిన కోదండపాణి, సత్య దంపతుల కుమారుడు తరునీష్ జత్యా. కోదండపాణి టీవీ మెకానిక్‌గా పనిచేస్తూ కుమారుడ్ని ఏదో క్రీడలో గొప్పవాడిగా చూడాలని ఆశపడేవాడు. ఈ క్రమంలో గూడూరులో అర్జున్ ఆర్చరీ అకాడమీ ఏర్పాటైంది. విలువిద్యపై తరునీష్ ఆసక్తిని గమనించి 2018లో అందులో చేర్పించాడు. అప్పుడు 5వ తరగతి చదువుతున్న తరునీష్ కోచ్ శివశంకర్ వద్ద నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. ప్రావీణ్యత సాధించాడు. అంకుఠిత దీక్ష, ఏకాగ్రత ఉంటేనే నిలదొక్కుకునే ఈ క్రీడలో అంచెలంచెలుగా రాణిస్తూ వస్తున్నాడు. ప్రస్తుతం సైదాపురంలోని ఓ ప్రైవేటు జూనియర్ కలాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మరోపక్క అహ్మదాబాదులోని ఓ ఆర్చరీ అకాడమీలో నాలుగు నెలలుగా శిక్షణ పొందుతున్నాడు.





డబుల్ గోల్డ్ మెడల్స్‌తో...

ఒలింపిక్‌లో మెడల్ లక్ష్యం

ఆర్చరీ అంటే ప్రాణం. పదో ఏడాది నుంచి ఈక్రీడపైనే దృష్టి పెట్టాను. అమ్మానాన్నలూ ప్రోత్సాహమందిస్తున్నారు. మన దేశం తరపున ఒలింపిక్ పోటీలలో పాల్గొని పతకం సాధించడమే నా ముందున్న ఏకైక లక్ష్యం. ఇందుకు పట్టుదలతో శ్రమిస్తున్నాను. అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తాననే నమ్మకముంది.

- తరునీష్ జత్యా

పదో ఏట నుంచే పతకాలు

తరునీష్ చిన్నతనం నుంచే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి ఆర్చరీ పోటీలలో ప్రతిభ చాటుతున్నాడు. గతేడాది నవంబరులో గుజరాత్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో వ్యక్తిగత, ఓవరాల్ విభాగాలలో డబుల్ గోల్డ్ మెడల్స్ సాధించాడు. స్థానిక ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఈ కుర్రాడి ప్రతిభకు ముచ్చటపడి రూ.50 వేలు నగదు ప్రోత్సాహక బహుమతితో సత్కరించారు. ఈ ఏడాది మేలో బీహార్ జరిగిన ఖేలో ఇండియా పోటీల్లోనూ మెరిసి కాంస్య పతకం దక్కించుకున్నాడు. 2022లో రాష్ట్రస్థాయి జూనియర్స్‌లో, గతేడాది రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్‌లో మొదటిస్థానంలో నిలిచాడు. ఈయేడాది జనవరిలో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీలలో మొదటి స్థానంలో నిలిచాడు.

సహకార రంగ అభివృద్ధికి ప్రణాళిక

- పీఏసీఎస్ వ్యాపార విస్తరణకు కృషి
- ముగింపు సదస్సులో కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని



సదస్సుకు విచ్చేసిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సహకార రంగం సాంకేతిక ఆధారిత బహుముఖాభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికలకు రూపకల్పన చేసినట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని తెలిపారు. తిరుపతి తాజ్‌హోటల్‌లో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. 'సహకార్ సే సమృద్ధి- సహకారంతో సుసంపన్నత' అంశంపై చర్చించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) కంప్యూటరీకరణ, డిజిటల్ లావాదేవీలు, బహుముఖ సేవలపై చర్చించినట్లు చెప్పారు. ఏపీలో 2,021 పీఏసీఎస్‌లను డిజిటలైజేషన్ చేసి ఈ-పీఏసీఎస్‌గా మార్చడం అభినందనీయమన్నారు. పీఏసీఎస్‌లలో నగదు రహిత లావాదేవీలు తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా పేపర్‌లెస్ వ్యవస్థలు, వన్‌స్టాప్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో పాలు, మత్స్య సహకార సమాఖ్యను బలోపేతం చేస్తామని వివరించారు. అనారోగ్య సహకార సంస్థల లిక్విడేషన్‌కు బదులుగా సంస్కరణలు చేపడతామని చెప్పారు. ఈ సదస్సు విజయవంతంగా ముగియడంతో కలెక్టర్ వెంకటేశ్వర్, అధికార యంత్రాంగానికి ఆశిష్‌కుమార్ భూటాని, రాష్ట్ర సహకార కమిషనర్ బాబు అభినందనలు తెలిపారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సహకార శాఖ అధికారులతో పాటు జిల్లా అడిషనల్ రిజిస్ట్రార్ ఆనందబాబు, గౌరీశంకర్, డీసీవో లక్ష్మి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మదురై సమీపంలో మరో వేంగైవయల్ సంఘటన

నీటి తొట్టెలో మానవవ్యర్థాలు

చెన్నై, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలో గురువారం ఉదయం మరో వేంగైవయల్ సంఘటన పునరావృతమైంది. మదురై జిల్లా చోళవందాన్ సమీపంలో ఉన్న అమ్మాచ్చియాపురం వద్ద 4 రోజులకు ముందు కొత్తగా ప్రారంభించిన ఓవర్‌హెడ్ నీటి ట్యాంక్‌లో మానవ వ్యర్థాలు పడి ఉన్నట్లు కనుగొనటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందారు. పుదుకోట జిల్లా వేంగైవయల్ గ్రామంలో 2022 డిసెంబర్ 26న షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజలు ఉపయోగించే ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌లో మానవ వ్యర్థాలు పడి ఉన్నట్లు కనుగొన్నారు. ఆ సంఘటనపై సీబీసీఐడీ పోలీసులు, జస్టిస్ ఎం.సత్యనారాయణన్ కమిషన్ విచారణ జరిపినా ఫలితం లేకపోయింది. సంఘటన జరిగి మూడేళ్లు దాటినా నిందితులను గుర్తించలేకపోయారు. ఈ పరిస్థితులలో తాజాగా మదురై సమీపంలోని అమ్మాచ్చియాపురంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.17లక్షలతో పాత ఓవర్‌హెడ్ ట్యాంక్ సమీపంలోనే కొత్త ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మించారు. నాలుగు రోజులకు ముందే ఈ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఆ వాటర్ ట్యాంక్ ద్వారా సరఫరా అవుతున్న నీటిలో దుర్గంధం వెలువడటంతో గ్రామస్తులు ఆ ఓవర్ హెడ్ ట్యాంక్‌పైకి వెళ్ళి పరిశీలన జరిపారు. ఆ వాటర్ ట్యాంక్‌లోని నీటిలో మలమూత్రాలు ఉన్నట్లు కనుగొని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ఆ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో ఆ వాటర్ ట్యాంక్ వద్ద స్థానికులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. నీటి తొట్టెలో మానవ వ్యర్థాలను కలిపిన దుండగులను గుర్తించి అరెస్టు చేయాలని స్థానికులు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ధర్నా జరిపారు. ఈ విషయం తెలుసుకుని తహసీల్దార్ పార్తీబన్, డిప్యూటీ తహసీల్దార్ సెంథిల్‌కుమార్, బీడీవో లక్ష్మీకాంతం తదితరులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. ఓ వైపు అధికారులు విచారణ జరుపుతుండగానే మరో వైపు ఆ నీటి తొట్టెలో మలం తదితర వ్యర్థాలు కలిసిన నీటి నమూనాలను సేకరించి స్థానిక అధికారులు ప్రయోగశాలకు పంపే ఏర్పాట్లు చేపట్టారు. ఈ విషయమై మదురై జిల్లా ఎస్పీ అరవిందన్ విలేఖరులతో మాట్లాడుతూ రెండు రోజులకు ముందు ఆ వాటర్ ట్యాంక్ నుంచి నీళ్లు సరఫరా కాలేదని కొంతమంది బాలురు నీటి తొట్టెపైకి ఎక్కారని తమకు సమాచారం అందిందని, అయితే ట్యాంక్‌లో మలమూత్రాలను ఎవరు కలిపారో ఇతమిత్థంగా తెలియలేదని అన్నారు. ఈ విషయమై మదురై జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటన జారీ చేస్తూ ఈ నెల 5న ఆ నీటి తొట్టెను ప్రారంభించారని, ఓ కులానికి చెందిన బాలుడొకడు చేసిన తుంటరి చర్యగా కనుగొన్నామని, ఈ విషయాన్ని ఆ బాలుడు కూడా అంగీకరించాడని పేర్కొన్నారు. దుండగులెవరో దురుద్దేశపూర్వకంగా ఈ చర్యకు పాల్పడ్డారని, పోలీసులు విచారణ జరిపి నిజమైన నేరస్థులను అరెస్టు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.



అమ్మాచ్చియాపురం వద్దనున్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌లు

పాదచారుల వద్ద హిజ్రాల నిలువుదోపిడి

ప్యారీస్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో పాదచారుల వద్ద నిలువుదోపిడీకి పాల్పడుతున్న హిజ్రాలను అదుపు చేయాలని గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పలువురు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎగ్మూర్ రాజరత్నం స్టేడియం సమీపంలో యాచక వృత్తిలో పాల్గొంటున్న కొంతమంది హిజ్రాలు అటుగా వెళ్లే వాహనచోదకులను, పాదచారులను బెదిరించి నగదు వసూలు చేసిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. సాయంత్రం 5 గంటల సమయంలో సుమారు 10 మందికి పైగా హిజ్రాలు ఫుట్‌పాత్ వ్యాపారులు, పాదచారులని ఎవ్వరినీ వదలకుండా నగదు వసూలు పాల్పడుతున్నారు. చేతిలో నగదులేని వారి వద్ద గూగుల్‌పే ద్వారా వసూలు చేసిన దృశ్యాలు ఆ ప్రాంతంలో పొందుపరిచిన సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయి. హిజ్రాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటూ వారి బెదిరింపులకు లోనైన కొందరు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం గమనార్హం.



ఓ వృద్ధుడి వద్ద గూగుల్‌పే ద్వారా నగదు వసూలు చేస్తున్న హిజ్రాలు

రెండు పాఠశాలలకు బాంబు బెదిరింపు

చెన్నై, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వరదరాజపురం, కొట్టివాక్కం ప్రాంతాల్లోని రెండు పాఠశాలలకు గురువారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయి. పడప్పై సమీపం వరదరాజపురంలో ఉన్న సీబీఎస్‌ఈ పాఠశాలకు ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపు సందేశం వచ్చింది. వెంటనే పాఠశాల నిర్వాహకులు ఆ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాంబ్‌స్క్వాడ్ నిపుణులను వెంటబెట్టుకుని ఆ పాఠశాలకు వెళ్ళి ముమ్మరంగా తనిఖీలు జరిపారు. చివరకు అది ఉత్తుత్తి బాంబు బెదిరింపు అని నిర్ధారణ అయ్యింది. ఇదే విధంగా కొట్టివాక్కం ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ఉన్న ప్రైవేటు పాఠశాలకు కూడా బాంబు బెదిరింపు రావటంతో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు జరిపినప్పటికీ ఎక్కడా బాంబులు ఉన్నట్లు ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊరట చెందారు.

చెన్నై సెంట్రల్-తిరుపతి అన్ రిజర్వ్‌డ్ రైలు సేవల్లో మార్పులు

పెరంబూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి చెన్నై సెంట్రల్‌కు బయల్దేరే రైలు, తిరుపతికి బదులు తిరుచానూరు నుంచి బయల్దేరనుంది. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... మరమ్మతుల పనుల కారణంగా చెన్నై సెంట్రల్ నుంచి తిరుపతికి వెళ్లే అన్ రిజర్వ్‌డ్ రైళ్ల సేవలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపింది. ఆ ప్రకారం, అరక్కోణం తిరుపతి వెళ్లే రైలు గురువారం నుంచి నవంబరు 5వ తేది వరకు తిరుపతికి బదులుగా తిరుచానూరు రైల్వేస్టేషన్ వరకు నడుపనున్నారు. మరుమార్గంలో తిరుపతి నుంచి అరక్కోణం బయల్దేరే రైలు తిరుపతికి బదులుగా తిరుచానూరు నుంచి బయల్దేరుతుంది. అలాగే, తిరుపతి నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లే రైలు తిరుపతికి బదులుగా తిరుచానూరు నుంచి, చెన్నై సెంట్రల్ నుంచి తిరుపతికి వచ్చే రైలు తిరుపతికి బదులు తిరుచానూరు వరకు మాత్రమే నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది.

ప్రధాన అవసరాలు సత్వరం పరిష్కరించాలి

- ప్రభుత్వం ఉత్తర్వులు

అడయార్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న గ్రామసభల్లో, ప్రజల అవసరాలు గుర్తించి, వాటిని తక్షణమే తీర్చగలిగిన మూడు అవసరాలను ఎంపిక చేసి తీర్మానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి ఏడాది గాంధీ జయంతి సందర్భంగా గ్రామ సభలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఆ రోజున విజయ దశమి పండుగ కావడంతో, గ్రామ సభలను ఈ నెల 2కు బదులుగా 11వ తేది నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకారం, ఈ నెల 11వ తేది గ్రామసభలు నిర్వహించనున్నారు. కులాలను అవమానించే గ్రామాల పేర్లు, రోడ్లు, వీధులు, తాగునీటి వనరులు, ప్రజా ఆస్తుల పేర్ల మార్పుపై చర్చించి, ఆ మార్పును అధికారిక గెజిట్‌లో ప్రకటించాలని తెలిపింది. గ్రామ పంచాయతీల నిధుల ఖర్చు, ఆడిట్ నివేదిక, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలు, డెంగ్యూ నివారణకు చేపట్టాల్సిన చర్యలు, డెంగ్యూ బాధితులకు సత్వర చికిత్సలు తదితరాలపై చర్చించాలని ప్రభుత్వం ప్రకటనలో సూచించింది.

యువకుడి హత్య

చెన్నై, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి గాంధీనగర్‌లో నివసిస్తున్న త్రిపుర రాష్ట్రానికి చెందిన చంద్రదాస్ (22) అనే యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. గాంధీనగర్ సాయిబాబా ఆలయం సమీపంలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని చంద్రదాస్ బసచేస్తూ కూలీ పనులకు వెళ్ళి వస్తుండేవాడు. అతడితోపాటు మరో యువకుడు కూడా ఆ ఇంటిలో నివసిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఒంటి నిండా కత్తిపోట్లతో చంద్రదాస్ శవంగా పడి ఉండటాన్ని చుట్టుపక్కలవారు గమనించి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుమ్మిడిపూండి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి విచారణ జరిపారు. చంద్రదాస్‌తోపాటు బసచేసిన మరో యువకుడు కనిపించకపోవడంతో అతడే ఈ హత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

వరుడు నచ్చక యువతి పరార్

ప్యారీస్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపంలో కుటుంబ పెద్దలు ఎంపిక చేసిన వరుడు నచ్చక పరారైన యువతి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహాబలిపురం సమీపంలో మనమై అంబేడ్కర్ వీధికి చెందిన ఆర్ముగం కుమార్తె అనసూయ (27)కు వివాహం జరపాలని నిర్ణయించిన కుటుంబ పెద్దలు నిర్మనంపట్టికి చెందిన ఓ యువకుడిని ఎంపికచేసినట్లు తెలిసింది. అయితే ఆ వరుడు అనసూయకు నచ్చలేదని తెలిసింది. గత నెల 29వ తేదీ దుకాణానికి వెళ్తున్నట్లు చెప్పిన అనసూయ తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కోసం తండ్రి ఆర్ముగంతో కలిసి కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా జాడ తెలియలేదు. దీనితో తమ కుమార్తె కనిపించడం లేదని ఇచ్చిన ఫిర్యాదును కేసుగా నమోదు చేసిన మహాబలిపురం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వరుడు నచ్చక అదృశ్యమైందా? లేదా మరేదైనా కారణమా? అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారు

- నేను చనిపోయాక నగదు నా ఇంటికి చేర్చండి
- ఎస్వీ జూపార్కు టైమ్‌స్కేల్ ఉద్యోగి సెల్ఫీ వీడియో

మంగళం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తాను చేసిన పనులకు డబ్బులు ఇవ్వకుండా మానసికంగా వేధిస్తున్నారంటూ ఎస్వీ జూపార్కులో టైమ్‌స్కేల్ ఉద్యోగి హరియాదవ్ బుధవారం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన సెల్ఫీ వీడియో సంచలనంగా మారింది. 'నేను జూపార్కులో అనేక పనులు చేశా. దీనికి రూ.11లక్షలకు నగలు కుదువబెట్టా. బిల్లులు అడిగితే ఒకసారి రూ.7.70లక్షలు, మరోసారి రూ.50వేలు, ఇంకోసారి రూ.లక్ష, ఆ తర్వాత రూ.8వేలు ఇచ్చారు. ఇంకా రూ.26లక్షలు రావాలి. ఈ బిల్లులు ఇవ్వకుండా నన్ను ఇబ్బంది పెడుతున్నారు. సహనం కోల్పోయి నేను ఆత్మహత్య చేసుకుంటే.. ఆ మొత్తాన్ని నా కుటుంబానికి అందించండి' అంటూ కన్నీటితో సెల్ఫీ వీడియో పెట్టారు. ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణ జరపాలని డిమాండు చేశారు. దీనిని చూసిన వారంతా ఆందోళన చెందారు. కాగా, గురువారం హరి జూపార్కులో తన విధులకు హాజరుకావడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

అతడి అక్రమాలు బయటపడతాయనే

- అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్

హరి సెల్ఫీ వీడియోపై ఎస్వీ జూపార్కు అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ స్పందించారు. '2023లోనే అతడు చేసిన పనులకు బిల్లులను చెల్లించాం. సెప్టెంబరు నెలలో హరి చేసిన పనులపై వచ్చిన ఆరోపణలకు క్యూరేటర్ సెల్వం ఏసీఎఫ్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ వేశారు. అతడి వద్ద బిల్లులు ఏవైనా ఉంటే ఇవ్వాలని కమిటీ కోరినప్పుడు.. నా వద్ద ఏమీ లేదని అతడు రాతపూర్వకంగా రాసిచ్చారు. హరి చేసిన పనుల్లో జరిగిన అవకతవకలు బయటపడతాయని భయపడి ఇలా చేసి ఉంటారు' అని జగదీష్ చంద్రప్రసాద్ తెలిపారు. జూపార్కు క్యూరేటర్ ఆదేశాలతో దీనిపై లోతైన విచారణ జరిపి అతడిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మధ్యాహ్న భోజనం చేసిన 30 మంది విద్యార్థులకు అస్వస్థత

అడయార్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పాలక్కోడు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేసిన 30 మంది విద్యార్థులు స్పృహతప్పి పడిపోయిన ఘటన కలకలం రేపింది. ధర్మపురి జిల్లా కల్నాయల్ గ్రామంలో ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల పనిచేస్తోంది. ఈ పాఠశాలలో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన 60 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గురువారం మధ్యాహ్నం సుమారు 40 మంది మధ్యాహ్న భోజనం చేశారు. కొద్దిసేపట్లోనే, 30 విద్యార్థినీ, విద్యార్థులు హఠాత్తుగా స్పృహ తప్పారు. ఉపాధ్యాయులు వారిని వెంటనే పాలక్కోడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు పొంది సాయంత్రం 12 మంది విద్యార్థులు డిశ్చార్జి కాగా, 18 మందికి చికిత్సలు కొనసాగుతున్నాయి. సమాచారం అందుకున్న విద్యాశాఖ అధికారులు పాఠశాలకు చేరుకుని మధ్యాహ్న భోజనం ఉద్యోగులను విచారించారు. అధికారుల ఫిర్యాదుతో పాలక్కోడు పోలీసులు కూడా ఘటనపై విచారణ చేపట్టారు.


మార్కులు తగ్గాయంటూ 8వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

అడయార్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): త్రైమాసిక పరీక్షల్లో మార్కులు తగ్గడంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తేని జిల్లాలో చోటుచేసుకుంది. రాయప్పన్‌పట్టి ప్రాంతానికి చెందిన జయశీలన్ దేసురాజా కుమారుడు బ్రీజిత్ ఇన్సెంట్ (13) అదే ప్రాంతంలోని పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల జరిగిన త్రైమాసిక పరీక్షల్లో ఇన్సెంట్‌కు తక్కువ మార్కులు వచ్చాయని తెలిసింది. మార్కులు తగ్గడంతో తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో విన్సెంట్, బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రాయప్పన్‌పట్టి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

గ్యాస్ టాంకర్ లారీ యజమానుల నిరవధిక సమ్మె

అడయార్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ ప్రాంత గ్యాస్ ట్యాంకర్ లారీల యజమానులు గురువారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. దక్షిణ ప్రాంత గ్యాస్ ట్యాంకర్ లారీల యజమానుల సంఘం నామక్కల్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తోంది. తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక, పుదుచ్చేరి తదితర రాష్ట్రాల నుంచి ఇండియన్ ఆయిల్, హిందుస్తాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం తదితర చమురు సంస్థలతో 2018-23 వరకు ఒప్పందం ఆధారంగా గ్యాస్ టాంకర్ లారీలు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్నాయి. ప్రస్తుతం చమురు సంస్థలు 2025-30 సంవత్సరాలకు ఒప్పందం కోసం టెండర్లు ప్రకటించాయి. గత ఒప్పందంలో 5514 లారీలకు టెండర్లలో పాల్గొనేందుకు అనుమతించగా, ప్రస్తుతం కొత్త టెండర్లలో పాల్గొనేందుకు 3,478 ట్యాంకర్ లారీలకు మాత్రమే అనుమతి కల్పించారు. ఈ క్రమంలో, గ్యాస్ టాంకర్ లారీ యజమానుల సంఘం అత్యవసర సమావేశంలో గురువారం నామక్కల్‌లో జరిగింది. సమావేశం అనంతరం సంఘ అధ్యక్షుడు సుందరరాజ్ మాట్లాడుతూ... టెండర్లలో అన్ని లారీలు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని కోరుతూ, గురువారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టినట్లు తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ



వేలూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ పౌష్టికాహార సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం వేలూరు పాత బస్టాండు వద్ద అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత ఆనంద్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్తికేయన్ మాట్లాడుతూ, దేశంలో పౌష్టికాహార లోపం వల్ల ఎంతో మంది చిన్నారులు మృత్యువాత పడుతున్నారని, మరికొంత మందికి దీని వల్ల శారీరక వైకల్యం వంటి సమస్యల్లో చిక్కుకుంటున్నారన్నారు. దేశాన్ని పౌష్టికాహారలోపం లేని దేశంగా మార్చుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



వేలూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వేలూరుకోట రోడ్డులోని ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. రెడ్‌క్రాస్ అసోసియేషన్ కోశాధికారి పాండియన్ పాల్గొని మాట్లాడుతూ, గత కొన్నేళ్లు పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులకు సంక్షేమ సహాయాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు మేల్‌మురుగన్, కాట్పాడి మండల అధ్యక్షుడు జనార్ధనన్, ఉపాధ్యక్షురాలు విజయకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోసఫ్ తదితరులు పాల్గొని సుమారు 5వేలకు పైగా విలువగల పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.